APBIL/26/A4072.

గోదావరి భవిష్యత్ వార్త
గోదావరి స్పెషల్ బులిటెన్
తెలుగు దినపత్రిక

సంపుటి : 1 | సంచిక : 43 | జూలై 05 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల : 2 రూ.

## ఐదో విడత రైతు భరోసా నిధులు విడుదల..

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఐదో విడత నిధులను విడుదల చేసింది. ఈ విడతలో 6 ఎకరాల వరకు సాగుభూమి ఉన్న 1.69 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.545.41 కోట్లను జమ చేసింది. ఇప్పటి వరకు రైతు భరోసా పథకం కింద మొత్తం 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,135.78 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. అర్హులైన ప్రతి రైతుకు దశలవారీగా రైతు భరోసా సాయాన్ని అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రైతులకు సాగు పెట్టుబడి భారాన్ని తగ్గించి, వ్యవసాయ కార్యకలాపాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. మిగిలిన అర్హులైన రైతులకు కూడా త్వరలోనే తదుపరి విడత నిధులను విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## ఫెదరర్ రికార్డును సమం చేసిన జకోవిచ్

టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ వింబుల్డన్‌లో మరో చారిత్రక ఘనత సాధించాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ రిండర్‌క్నెక్‌పై మూడో రౌండ్‌లో 7-5, 6-4, 1-6, 7-6తో విజయం సాధించాడు. అయితే జకోవిచ్‌కు వింబుల్డన్ టోర్నీలో ఇది 105వ సింగిల్స్ మ్యాచ్ విజయం కావడం విశేషం. ఈ క్రమంలో పురుషుల విభాగంలో అత్యధిక విజయాలు సాధించిన రోజర్ ఫెదరర్ రికార్డును జకోవిచ్ సమం చేశాడు. మహిళల విభాగంలో మార్టినా నవ్రతిలోవా 120 సింగిల్స్ విజయాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఫ్రాన్స్‌పై విజయంతో జకోవిచ్ నాలుగో రౌండ్‌కు అర్హత సాధించాడు. కాగా వింబుల్డన్‌లో 7 టైటిళ్లు సాధించిన జకోవిచ్.. ఫెదరర్ ఎనిమిది టైటిళ్ల రికార్డును కూడా సమం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. కాగా ఫెదరర్ రికార్డు గురించి మ్యాచ్ అనంతరం జకోవిచ్ మాట్లాడాడు. '105 విజయాలతో ఫెదరర్ రికార్డును సమం చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. అయితే 106వ విజయం కోసం మా ఇద్దరి మధ్య మ్యాచ్ నిర్వహించాలని వింబుల్డన్ నిర్వాహకులను కోరుతున్నా' అంటూ జకోవిచ్ సరదాగా వ్యాఖ్యానించాడు.

# కుప్పంలోనూ బంగారం ఉత్పత్తి చేస్తాం

## సీఎం చంద్రబాబు



చిత్తూరు: కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కుప్పంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్‌ను ప్రారంభించామని, కుప్పంలో కూడా బంగారు గనులు ఉన్నాయని చెబుతున్న నేపథ్యంలో వాటిని అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజల భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించిందని, ప్రస్తుతం వివాదాల్లో ఉన్న భూముల సమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. టీటీడీ నిధులతో రూ.34 కోట్ల వ్యయంతో కుప్పంలోని ఆలయాలను అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కుప్పం అభివృద్ధిపై గత ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందని విమర్శించారు. కుప్పానికి నీళ్లు తీసుకొచ్చామని సినిమా సెట్టింగులు వేసి ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. కుప్పానికి వచ్చే ప్రతి ఒక్కరికీ కొత్త అనుభూతి కలిగేలా ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్ వంటి పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కుప్పం సమగ్ర అభివృద్ధి కోసం సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ వంటి ప్రముఖ సంస్థల సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఈ క్రమంలోనే రాజకీయాలపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల విషయంలో తాను ఎప్పుడూ సౌమ్యంగానే ఉంటానని, అయితే సంఘ విద్రోహ శక్తుల విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తానని స్పష్టం చేశారు. సీమ ఫ్యాక్షనిజంపై సినిమాలు తీసే రోజులు పోయాయని, ఇప్పుడు రాయలసీమలో పరిస్థితులు పూర్తిగా మారాయని అన్నారు. మరో రెండేళ్లలో తన రాజకీయ జీవితం 50 ఏళ్లు పూర్తవుతుందన్నారు. రాష్ట్రంలో రౌడీలు రాజకీయాల్లోకి రావడం వల్లే అనేక దుర్ఘటనలు జరిగాయని విమర్శించారు. వివేకానంద రెడ్డి హత్య, కోడి కత్తి వంటి ఘటనలకు, తనను బాధ్యుడిగా చేశారని సీఎం చంద్రబాబు విమర్శించారు. అలాగే, మాస్క్ అడిగిన డాక్టరును చనిపోయేలా చేశారని.. డ్రైవరును కారు డిక్కిలో పెట్టి డోర్ డెలివరీ చేశారని.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజధాని అంశంపై కూడా సీఎం స్పందించారు. కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిన తర్వాత రాజధానిని మార్చడం సాధ్యం కాదని అన్నారు. అమరావతికి బదులుగా కొత్త పేర్లతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. అమరావతి అభివృద్ధినే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఖమేనీ పక్కనే ఏడాదిన్నర చిన్నారి శవపేటిక..




ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీకి నిర్వహిస్తున్న తుదివీడ్కోలు కార్యక్రమాలు దేశవ్యాప్తంగా తీవ్ర భావోద్వేగాలను రేకెత్తిస్తున్నాయి. గ్రాండ్ మోసల్లా ప్రాంగణంలో ప్రజల సందర్శనార్థం ఖమేనీ పార్థివదేహాన్ని ఉంచగా.. ఆయన పక్కనే ఉంచిన ఏడాదిన్నర వయసున్న చిన్నారి శవపేటిక అందరినీ కంటతడి పెట్టిస్తోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిత్రాల ప్రకారం.. ఆ చిన్నారి ఖమేనీ 14 నెలల మనవరాలు జహ్రా మొహమ్మది గోల్పాయెగాని అని తెలుస్తోంది. జాతీయ జెండాతో కప్పిన చిన్న శవపేటిక పక్కనే ఆమె ఫొటోను ఉంచడంతో అక్కడికి వచ్చిన ప్రజలు తీవ్ర భావోద్వేగానికి గురవుతున్నారు. ఫిబ్రవరి 28న జరిగిన అమెరికా--ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు ఇరాన్ వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనలో జహ్రాతో పాటు ఆమె తల్లి, మరికొందరు కుటుంబ సభ్యులు కూడా మరణించినట్లు సమాచారం. అప్పటి నుంచి భద్రపరచిన పార్థివదేహాలను ఇప్పుడు ఆరు రోజుల పాటు ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఖమేనీ భౌతికకాయాన్ని ఇరాన్ జాతీయ జెండాతో కప్పి, ఆయన ధరించే నల్ల టర్బన్‌ను సంప్రదాయబద్ధంగా తలవద్ద ఉంచారు. కుటుంబ సభ్యుల పార్థివదేహాలను కూడా ప్రత్యేక శవపేటికల్లో ఆయన పక్కనే ఏర్పాటు చేశారు. అందులో చిన్నారి జహ్రా శవపేటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచినా, అదే సమయంలో అత్యంత విషాదకర దృశ్యంగా మారింది. ఈ కార్యక్రమానికి ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాకర్ ఘలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. చిన్నారి శవపేటికను చూసిన పలువురు నేతలు, అధికారులు భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీరు పెట్టుకున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. గ్రాండ్ మోసల్లా వద్దకు దేశ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. గేట్లు తెరవగానే వేలాది మంది ఒకేసారి లోపలికి చేరుకుని ఖమేనీకి తుదివీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అమెరికా వ్యతిరేక నినాదాలు మార్మోగాయి. ప్రతీకారాన్ని సూచించే ఎరుపు జెండాలు ప్రదర్శించిన కొందరు ఆందోళనకారులు అమెరికాపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కూడా తీవ్ర వ్యాఖ్యలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. ఇరాన్ ప్రభుత్వ అంచనా ప్రకారం ఈ ఆరు రోజుల సంతాప కార్యక్రమాల్లో వివిధ దశల్లో దాదాపు రెండు కోట్ల మంది పాల్గొనే అవకాశం ఉంది. భారత్, రష్యా, పాకిస్థాన్, టర్కీ సహా సుమారు 100 దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమాలకు హాజరైనట్లు సమాచారం. భారీ జనసందోహాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సోమవారం వరకు ఖమేనీ పార్థివదేహాన్ని టెహ్రాన్‌లో ఉంచి, అనంతరం పవిత్ర నగరమైన ఖోమ్‌కు తరలించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత కర్బలా, నజాఫ్ ప్రాంతాల మీదుగా ప్రత్యేక సంతాప యాత్ర నిర్వహించి, చివరగా గురువారం ఆయన స్వస్థలమైన మష్హద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో ఇరాన్ అంతటా విషాద ఛాయలు అలుముకున్నాయి. ముఖ్యంగా ఖమేనీ పక్కనే ఉంచిన చిన్నారి జహ్రా శవపేటిక ప్రపంచవ్యాప్తంగా ప్రజల హృదయాలను కలిచివేస్తున్న దృశ్యంగా మారింది.

## వైద్యురాలి మృతి కేసులో దోషిగా తేలిన బీజేపీ ఎమ్మెల్యే.. నాలుగేళ్ల జైలుశిక్ష




బిహార్‌లోని సాహెబ్‌గంజ్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే రాజుకుమార్ సింగ్‌కు ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు నాలుగేళ్ల జైలుశిక్ష విధించింది. 2019 న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా జరిగిన ఫైరింగ్‌లో డాక్టర్ అర్చనా గుప్తా మృతిచెందిన కేసులో ఆయన్ను దోషిగా తేల్చుతూ తీర్పు వెలువరించింది న్యాయస్థానం. ఈ కేసులో ఆయనకు జైలుశిక్షతో పాటు రూ.25 లక్షల జరిమానా కూడా విధించింది.


2018 డిసెంబరు 31న అర్ధరాత్రి ఢిల్లీలోని ఫతేపూర్ బేరీ ప్రాంతంలో రాజుకుమార్ సింగ్ ఫామ్‌హౌస్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సెలబ్రేషన్స్‌లో ఆయన గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ టైమ్‌లో అక్కడే ఉన్న డాక్టర్ అర్చనా గుప్తా(45) తలకు బుల్లెట్ తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారామె. ఈ ఘటనపై నమోదైన కేసులో విచారణ చేపట్టిన న్యాయస్థానం.. గత జూన్‌లో రాజుకుమార్ సింగ్‌ను బీఎన్ఎస్-304(2) సహా ఆయుధ చట్టంలోని నిబంధనల్ని ఉల్లంఘించారని దోషిగా తేల్చింది.

అయితే.. శిక్షను ఖరారు చేసే సమయంలో రాజుకుమార్ సింగ్‌కు ఎలాంటి హత్యోద్దేశం లేదని ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. ప్రజాప్రతినిధిగా ఆయనకు మంచి పేరుండటంతో శిక్షను తగ్గించాలని కూడా కోర్టును కోరారు. అయితే.. నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. నాలుగేళ్ల జైలుశిక్షతో పాటు 25 లక్షల రూపాయల జరిమానా విధించింది. ఈ తీర్పు రాజుకుమార్ సింగ్ రాజకీయ భవిష్యత్తుపై ఏమేర ప్రభావం చూపుతుందనే విషయం చర్చనీయాంశమైంది.

## ఏపీ ప్రభుత్వం మరో హామీ అమలు

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వరుస గా అమలు చేస్తోంది. సూపర్ సిక్స్ లో భాగంగా ఇప్పటికే నాలుగు పథకాలు అమల్లోకి వచ్చాయి. ప్రతీ నెలా ఒకటో తేదీన పెన్షన్లను ఇంటి వద్ద పంపిణీ చేస్తున్నారు. ఇప్పుడు మిగిలిన హామీల అమలు పైన కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా మరో పథకం అమలు దిశగా ప్రకటన చేసారు. దీని ద్వారా ఇక అర్హుల ఖాతాల్లో రూ 10 వేలు జమ కానున్నాయి. ఏపీ ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదులకు తీపి కబురు అందించింది. గతంలో వారికి ఇచ్చిన ఆర్దిక తోడ్పాటు రెట్టింపు చేసి అమలు చేస్తామని గతంలో నే కూటమి నేతలు హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా ఇప్పుడు జూనియర్ న్యాయవాదులు ఆర్థికం గా నిలదొక్కుకునేందుకు ప్రస్తుతం ఇస్తున్న రూ.5,000 స్టైఫండ్‌ను ఏకంగా రూ.10,000కు పెంచుతున్నట్లు మంత్రి ఫరూక్ ప్రకటించారు. ఈ స్టైఫండ్ పెంపునకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను ప్రభుత్వం త్వరలోనే జారీ చేయనున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో రాష్ట్రం లో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం భారీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఏపీవ్యాప్తంగా కొత్తగా 96 కోర్టులను మంజూరు చేసామని గుర్తు చేసారు. న్యాయ శాఖలో ఖాళీగా ఉన్న 1,770 పోస్టుల భర్తీకి ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వివరించారు. కాగా, రాష్ట్రంలో కొత్తగా కోర్టు భవనాలు, జడ్జిల క్వార్టర్లు, గెస్ట్ హౌస్‌ల నిర్మాణంతో పాటుగా ఆధునీక రణ కోసం రూ.216 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. అదే విధంగా న్యాయశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. లా ఆఫీసర్ల పదవీ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచగా, హైకోర్టు న్యాయమూర్తు ల గ్రాట్యుటీ పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచింది. వీటితో పాటు హైకోర్టు ఏజీపీల గౌరవ వేతనాన్ని 25 శాతం పెంచుతూ, స్పెషల్ జ్యుడిషియరీ మేజిస్ట్రేట్‌ల వేతనాన్ని రూ.30,000 నుంచి రూ.45,000కు పెంచారు. వీరికి అదనంగా నెలకు రూ.5,000 చొప్పున ప్రయాణ ఖర్చులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది గుర్తు చేసారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు పైన ప్రక్రియ కొనసాగుతుందని త్వరలోనే ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రకటించారు.


## ఇండియాలోనే ఫస్ట్ టైం.. అమరావతిలో శాటిలైట్‌తో హెలికాప్టర్ ల్యాండింగ్




భారీ వర్షం పడుతున్నప్పుడు, లైటింగ్ సరిగ్గా లేని సమయంలో, వాతావరణం అనుకూలించని సమయంలో హెలికాప్టర్‌లను ల్యాండ్ చేయడం చాలా కష్టం. వాతావరణం అనుకూలించక హెలికాప్టర్ ప్రయాణాలు రద్దు కావడం కూడా మనం చూస్తూ ఉంటాం. ముఖ్యంగా భారీ వర్షాల కారణంగా వరదల్లో చిక్కుకున్న వారిని హెలికాప్టర్ ద్వారా రక్షించేందుకు ప్రయత్నించిన సమయంలో వాతావరణ అనుకూలించడం లేదు అంటూ వార్తలు వింటూ ఉంటాం. ఇకపై అలాంటి వార్తలు వినబోము... ఎందుకంటే ఎలాంటి వాతావరణంలో అయినా, అర్ధ రాత్రి సమయంలో అయినా హెలికాప్టర్‌లు ల్యాండ్ అయ్యేందుకు కొత్త టెక్నాలజీని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూపొందించింది. ఇటీవలే ఈ సాంకేతి పరిజ్ఞానంకు డీజీసీఏ అనుమతులు రావడంతో అమరావతిలో టెస్ట్ రన్ నడిచింది. అమరావతిలో ఫస్ట్ హెలిపోర్ట్ ల్యాండింగ్ టెక్నాలజీ... శాటిలైట్ సహాయంతో హెలిపోర్ట్ ల్యాండింగ్ సాంకేతికత అభివృద్ధి చేశారు. భారతదేశంలోనే ఫస్ట్ శాటిలైట్ ఆధారిత హెలిపోర్ట్ ల్యాండింగ్‌ను ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలోని ఉండవల్లి హెలిపోర్ట్‌లో ప్రారంభించారు. భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ అత్యాధునిక విధానానికి ఆమోదం తెలపడంతో ఇక ముందు సమయం తో సంబంధం లేకుండా, వాతావరణ ఇబ్బందులు లేకుండా ఈజీగానే హెలికాప్టర్‌లు నూటికి నూరు శాతం సురక్షితంగా ల్యాండ్ కాబోతున్నాయి. దట్టమైన పొగమంచు ఉన్నప్పటికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా శాటిలైట్ సాయంతో భూమి పై ఉన్న హెలిపాడ్ కి హెలికాప్టర్ చేరుకునే విధంగా ఈ సాంకేతిక పరిజ్ఞానం ను తయారు చేయడం జరిగింది. నావిగేషన్ సహాయంతో హెలికాప్టర్ ను సురక్షితంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా పైలెట్ హెలికాప్టర్‌ను (తరువాయి 2వ పేజీలో)

## ఇథనాల్ పెట్రోల్ కు ఓ దండం"- E20పై భారత్ కు భూటాన్ షాక్..!

ఓవైపు కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (E20)ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా దేశంలో చమురు దిగుమతుల్ని తగ్గించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మరోవైపు వాహనాలకు ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకం వల్ల ఎదురవుతున్న సమస్యలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. అయినా కేంద్రం మాత్రం తన మొండిపట్టు వీడటం లేదు. ఎలాగైనా ఇథనాల్ పెట్రోల్ వాడకం పెంచాలని కార్ల కంపెనీల్ని కూడా ప్రోత్సహిస్తోంది. ఇదే క్రమంలో పొరుగుదేశం భూటాన్ కు కూడా తమ ఇథనాల్ పెట్రోల్ ఈ20ని తీసుకోవాలని ఆఫర్ ఇచ్చింది. అయితే భూటాన్ దీన్ని తిరస్కరించింది. E20 ఇంధన సరఫరాపై భారత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చేసిన ప్రతిపాదనను భూటాన్ నిశ్శబ్దంగా తిరస్కరించింది. భారత మార్కెట్లో సాధారణ పెట్రోల్ అందుబాటులో ఉన్నంత కాలం, దానినే సరఫరా కొనసాగించాలని భూటాన్ భారత్‌ను కోరింది. అయితే ఇథనాల్ పెట్రోల్ ను భూటాన్ ఎందుకు వద్దని చెప్పిందనే దానిపై కీలక కారణాలు కనిపిస్తున్నాయి. భూటాన్‌లో ఇంధన నిల్వ సదుపాయాలు ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌ను నిర్వహించడానికి అనువుగా లేవు. వాహనాలకు గరిష్ట శక్తి అవసరం కాబట్టి, అక్కడి నిటారుగా, కొండలతో కూడిన భూభాగం కూడా సవాలుగా ఉంది. భూటాన్‌లోని పర్వత ప్రాంత రహదారులపై అవసరమైన స్థిరమైన పనితీరును ఈ20 అందించకపోవచ్చని అధికారులు భయపడుతున్నారు. ఇథనాల్ ప్రయోగం వాదనపై కేంద్రం యూటర్న్..! సుప్రీం విచారణపై వివరణ...! భారతదేశంల 20% ఇథనాల్, 80% పెట్రోల్ మిశ్రమమైన ఇ20 పెట్రోల్‌ను ప్రవేశపెట్టడం 2023కి ముందు తయారైన పెట్రోల్ వాహనాల యజమానుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. ఈ పెట్రోల్ వాడకం వల్ల మైలేజ్ తగ్గిపోవడం, నిర్వహణ సమస్యలు పెరగడం, వాహనాలు అధికంగా అరిగిపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ20 వల్ల




మైలేజ్ కొద్దిగా తగ్గుతుందని ప్రభుత్వం తాజాగా అంగీకరించినప్పటికీ, మెరుగైన యాక్సిలరేషన్, మంచి ఇంజిన్ పనితీరుతో పోలిస్తే ఈ ప్రతికూలతను అధిగమించవచ్చని చెబుతోంది. ఈ నేపథ్యంలో ఇ20 పెట్రోల్ కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలు భూటాన్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. ఎందుకంటే, తన ఇంధనాన్ని మొత్తం నేరుగా భారత్ నుండే దిగుమతి చేసుకుంటుంది. ప్రస్తుత భూటాన్ భారత్ నుండి అధిక-ఎక్స్ పోర్ట్ క్వాలిటీ గల పెట్రోల్, డీజిల్‌ను కొనుగోలు చేస్తోంది. ఇవి భారతీయ పెట్రోల్ బంకుల్లో అమ్మే ఇంధనం కంటే ఖరీదైనవి. అయితే ఇ20 పెట్రోల్‌ను సరఫరా చేయడానికి ముందుకు వచ్చిన భారతీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల్ని భూటాన్ తిరస్కరించింది.

# ఉపాధ్యాయులదే అధిక బాధ్యత

ప్రస్తుతం సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలను చాలా గారాబంగా పెంచుతున్నారు. గారాబం అని అనే కంటే రిచ్‌గా పెంచుతున్నారు అని అంటే బావుంటుందేమో. వాళ్ళు అడిగిన వాన్ని కొనిస్తూ, తాము చిన్నతనంలో పొందలేకపోయామని అనుకుంటూ వాళ్లకు ఎంత వరకు ఆ వస్తువు అవసరం అనేది ఆలోచించకుండానే వారికి ఇస్తున్నారు. అది లక్షల ఖరీదు చేసే బుల్లెట్ (స్కూటరు) అయినా లక్షల విలువ చేసే ఐఫోన్ అయినా సరే వాళ్ళు కావాలి అని అడిగితే చాలు కొని ఇస్తున్నారు. ఈ మధ్య ఓ అబ్బాయి ఐఫోన్ కొని ఇవ్వలేదని ఆత్మహత్య చేసుకున్నాడు. మరో అబ్బాయి స్కూటర్ కొనివ్వలేదని ఆత్మహత్య చేసుకున్నాడు. యుక్తవయస్సులో వున్న పిల్లలు అర్థాంతరంగా ఇలా ఆత్మహత్యలు చేసుకుని చనిపోతే ఆ తల్లిదండ్రుల బాధ వర్ణణాతీతంగా వుంటుంది. ఇలా బెదిరిస్తే తల్లిదండ్రులు తమకు కావలసినవి కొని ఇస్తారని వారు అనుకుంటున్నారు. కాని వారు జీవితాన్నే కోల్పోతున్నారు. జీవించి వుంటే ఇప్పుడు కాకపోయినా కొన్ని నెలలకో, సంవత్సరాలకో వారు కావలసినది పొందే అవకాశం వుంది. ఇలా తెలివితక్కువగా ఆలోచించి తల్లిదండ్రులను భయపెడుతున్నాము అనుకుని తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మరి కొంతమంది పరీక్ష ఫెయిల్ అయ్యామని, మరి కొందరు ప్రేమలో విఫలమయ్యి ఆత్మహత్యతలకు పాల్పడుతున్నారు. ఈ విధంగా జరగడానికి కారణాలు మెచ్యూరిటీ లేకపోవడం, ఉక్రోషం, స్నేహితుల వద్ద చిన్నతనంగా వుంటుందని, ఇలా పలు కారణాల వల్ల పిల్లలు దుందుడుకుగా ప్రవర్తిస్తున్నారు. చిన్నతనం నుండే పిల్లలలో సత్రప్రవర్తన కలిగే విధంగా పాఠశాలలోను, ఇంటివద్ద వారిని జాగ్రత్తగా పరిశీలిస్తూ వుండాలి. తోటి అక్కాచెల్లెలు, అన్నదమ్ములతో తల్లిదండ్రులు పిల్లలను కంపేరిజన్ చేయకూడదు. మన స్థితిగతులు కూడా వారికి అర్థమయ్యే విధంగా వారికి తెలియజేయాలి. గొప్పలకు, హంగు ఆర్భాటాలకు పోనివ్వకుండా తల్లిదండ్రులు పిల్లలను పెంచాలి. స్కూల్‌లో టీచర్స్ కూడా పిల్లలకు చక్కటి విలువలను నేర్పించాలి. గురువులు చెప్పే విషయాలను పిల్లలు వింటారు. వినడమే కాదు ఆచరిస్తారు కూడా. ఈ మధ్య ఉత్తర ప్రదేశ్‌లో మీర్జాపూర్‌కు చెందిన 5 సం.ల బాలిక ఇందుకు ఉదాహరణ. పాప తల్లి కుటుంబ కలహాల వల్ల విషం తాగడంతో అది గమనించిన శివాణి 1090కి ఫోన్ చేయగా ఉమెన్ హెల్ప్‌లైన్ వారు వెంటనే స్పందించి ఆ తల్లిని కాపాడగలిగారు. అపాయంలో వున్నప్పుడు 1090కి ఫోన్ చేయమని వాళ్ళ టీచరు చెప్పినట్లు శివాణి చెప్పింది. ఇలా అత్యవసర ఫోన్ నెంబర్లు పాఠశాలల్లో టీచర్లు చెప్పడం కూడా చాలా మంచిది. అదే విధంగా ప్రతీ విషయానికి సానుకూలంగా స్పందించే విధంగా పిల్లలను తీర్చిదిద్దగల సత్తా టీచర్స్‌కి ఎక్కువగా వుంటుంది. ఈ మధ్య ఓ టీచరు విద్యార్థినిచే కాళ్లు నొక్కించుకుంది. టీచర్జై వుండి ఆ విధంగా చేయడం చాలా దౌర్జన్యం. టీచర్స్ విద్యార్థులను మంచిపౌరులుగా తీర్చిదిద్దాలే తప్ప తమ సొంత పనులకు ఉపయోగించడం బాధాకరం. నేటి బాలలే రేపటి పౌరులు. వారిని ఉన్నతంగా తీర్చిదిద్దగలిగితే దేశం పురోభివృద్ధి చెందుతుంది.



– గొర్రెల సత్యవతి, సెల్: 9492387819

# ఇండియాలోనే ఫస్ట్ టైం..

(1వ పేజీ తరువాయి) ల్యాంగ్ చేయవచ్చని అధికారులు చెప్పుకొచ్చారు. సిగ్నలింగ్ లేకుండా హెలికాప్టర్ ల్యాండింగ్... ఇప్పటి వరకు హెలికాప్టర్ ల్యాండింగ్‌కు భూమి మీద ఖరీదైన సిగ్నలింగ్ వ్యవస్థలు అవసరం అయ్యేవి. అయితే ఇప్పుడు ఆ సిగ్నలింగ్ వ్యవస్థలు అవసరం లేకుండా అంతరిక్షంలో ఉన్న శాటిలైట్ ఇచ్చే డేటా ఆధారంగానే హెలికాప్టర్‌లు ల్యాండ్ కావచ్చు. అది కూడా అత్యంత సురక్షితంగా అని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా హెలికాప్టర్ ప్రయాణం కేవలం డే టైమ్‌లోనే, అది కూడా వాతావరణం అనుకూలిస్తేనే చేయాల్సి ఉంటుంది. కానీ ఈ శాటిలైట్ ఆధారిత హెలిపోర్ట్ ల్యాండింగ్ సాంకేతికతతో 24/7 హెలికాప్టర్‌ల ప్రయాణం సాగించవచ్చని అధికారులు అంటున్నారు. భారతదేశంలోనే మొదటి సారి ఈ సాంకేతిక పరిజ్ఞానం ను అమరావతిలోని ఉండవల్లి ప్రాంతంలో పరీక్షించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక గుర్తింపు లభించినట్లు అయిందని స్థానికులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరావతిలోని ఉండవల్లికి అరుదైన గౌరవం... ఉండవల్లి హెలిపోర్ట్ ప్రారంభించిన అనంతరం అధికారులు మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో, రోడ్డు మార్గం ద్వారా చేరుకోలేని, కనెక్టివిటీ లేని ప్రాంతాలకు ఈ సాంకేతిక పరిజ్ఞానంతో ఈజీగా చేరుకుని, అక్కడ చిక్కుకున్న వారిని రక్షించే అవకాశం ఉందన్నారు. పర్యాటకులు, అత్యవసర ప్రయాణాలకు ఇది అత్యంత ఉపయోగదాయకంగా వారు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని చోట్ల ఈ సాంకేతికతను విస్తరించబోతున్నట్లుగా విమానయాన మంత్రిత్వ శాఖ ప్రకటించింది. భవిష్యత్తులో విమానయాన రంగంలో ఈ సాంకేతికత కారణంగా విప్లవాత్మక మార్పులు వస్తాయని అధికారులు చెప్పుకొచ్చారు. అమరావతి వంటి ప్రాంతంలో ఈ కొత్త ఆవిష్కరణ ను ప్రారంభించడం ద్వారా ప్రపంచం దృష్టిని అమరావతిపై పడేలా చేశారంటూ పరిశీలకులు అంటున్నారు.

# వైభవంగా శ్రీసత్యదేవుని తిరుచ్చి ప్రాకారసేవ.

అన్నవరం,(జి యస్ బి వార్త),జులై – 04 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శ్రీ సత్యదేవుని తిరుచ్చి ప్రాకార సేవ శనివారం ఉదయం 10 గంటలకు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు కంచిభట్ల రామ్ కుమార్ శ్రీస్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఏఈఓ భాస్కర్ కొబ్బరికాయ కొట్టి మొదలెట్టారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కృష్ణ ప్రసాద్, వేధపండితులు చిట్టి శివ, గొల్లపల్లి ఘనాపాటి,దేవస్థానం అధికారులు,సిబ్బంది,వ్రత పురోహితులు,భక్తులు,గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



జగ్గంపేట జూలై 4 జి ఎస్ బి వార్త :స్థానిక గోకవరం రోడ్డులోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో జగ్గంపేట క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అప్పలరాజు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి సీతారామరాజు 129 వ జయంతి వేడుకలు సందర్భంగాఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "అల్లూరి సీతారామరాజు అంటే తెలుగు జాతి పౌరుషానికి ప్రతీక. కేవలం 27 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిద్రలేకుండా చేసిన ధీశాలి. తుపాకీకి విల్లంబులతో సమాధానం చెప్పిన యోధుడు. అడవి బిడ్డల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తి. ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకం. మన్యం ప్రజల విముక్తి కోసం సాగించిన రంప ఉద్యమం భారత స్వాతంత్ర్య చరిత్రలో సువర్ణ అధ్యాయం." అలాగే ఆర్థికంగా వెనుకబడిన క్షత్రియ కుటుంబాలను ఆదుకునేందుకు జగ్గంపేట క్షత్రియ పరిషత్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఎస్వీఎస్ అప్పలరాజు గారు స్పష్టం చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు

# త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి గోవింద్

**కాలనీ ప్రజలతో మమేకమై సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న ఇనుకోటి బాపన్న దొర.**




గోకవరం జూలై 4 జి ఎస్ బి వార్త : గోకవరం మండలం మేజర్ పంచాయతీ పరిధిలోని సంజీవ్ నగర్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యపై మండల ప్రజాపరిషత్ అధికారి వెంటనే స్పందించారు స్థానికులు త్రాగునీటి సమస్యపై ఎదుర్కొంటున్న ఇబ్బందుల పై ఆయన సంజీవ్ నగర్ కాలనీకి చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడిన ఎంపీడీవో గోవింద్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంజీవయ్య నగర్ కాలనీలో ఉన్న త్రాగునీటి సమస్య పై నిరంతరం స్పందిస్తూ సమస్య పరిష్కారానికి అధికారులకు అనేకసార్లు వినతి పత్రం అందజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న మండలం బిజెపి అధ్యక్షులు ఇనుకోటి బాపన్న దొర ను స్థానికులు అభినందిస్తున్నారు ఈ సందర్భంగా ఇనకోటి దొర మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులతో వెంటనే సమన్వయం చేసి, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం శుభ పరిణామమని కాలనీలో ఎన్నో రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న తమ సమస్యపై వెంటనే స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపడతానని భరోసా ఇవ్వడంతో ఎంపీడీవో గోవింద్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు ఇలాగే ప్రజా సమస్యలపై వేగంగా స్పందించి పరిష్కారం చూపాలని స్థానికు ప్రజలు కోరుతున్నారు.. ఈ కార్యక్రమంలో.. గ్రామస్తులు తోలేటి రాంప్రసాద్ ఇజిన డాక్టర్ శీను టీడీపీ లాజర్ బొడ్డపాటి వీర చంద్రం, బిజ్జి రాజు స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు...

# కిడ్నాప్ మరియు పోక్సో కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్



గోకవరం జూలై 4 జి ఎస్ బి వార్త : గోకవరం పోలీస్ స్టేషన్ పరిధి లో ది.వి 17.06.2026 రాత్రి గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామం నుండి మాయ మాటలు, మోసపూరితమైన మాటలు చెప్పి ముగ్గురు మైనర్లు ను అపహరించుకుని పోయిన ఘటనలో కిడ్నాప్ మరియు పోక్సో కేసు నమోదు చెయ్యగా పరారిలో ఉన్న పై కేసులో ప్రధాన నిందితుడు అయినా గోకవరం గ్రామానికి చెందిన రావుల వాసు ను ఈ రోజు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు వారు రిమాండ్ విధించినారని శ్రీ కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఎమా మూర్తి గారు మరియు గోకవరం పోలీస్ స్టేషన్ రా× దీ నాగమణి గారు తెలియజేసారు. కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ మూర్తి మాటలాడుతూ 1.మైనర్ అమ్మాయిల పట్ల మరియు చిన్న పిల్లల పట్ల వారి తల్లిదండ్రులు మరియు సంరక్షకులు అప్రమత్తంతో ఉండాలని 2. టీనేజ్ పిల్లల కదలికల పై వారి తల్లిదండ్రులు మరియు సంరక్షకులు ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని టీనేజ్ ఆడపిల్లలు, మైనర్లు వాడే ఫోన్స్ మీద మరియు పేస్ బుక్, ఇన్స్టాగ్రామ్స్ మరియు ఇతర సోషల్ మీడియా యాక్టివిటీస్ పై నిరంతరం తల్లిదండ్రులు మరియు సంరక్షకుల నిఘా ఉంచాలని ముఖ్యంగా ఆడపిల్లలు, మైనర్లు, టీనేజ్ గర్ల్స్ ఎలాంటి ప్రలోభాలకు లోను కాకూడదు ఎవరితోనైనా ఏదైనా ఇబ్బందులు ఎదురైతే తల్లిదండ్రులకు సంరక్షకులు కు తెలియజేయాలి 4. స్కూల్స్, కాలేజె, హాస్టల్స్ మరియు ట్యూషన్ సెంటర్లలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే ఆ విషయాన్ని తల్లిదండ్రులకు మరియు టీచర్స్ కి తెలియజేయాలి 5. ప్రేమ పేరుతో, పెళ్లి పేరుతో మోసపూరిత మాటలు నమ్మకూడదు ఇటీవల గర్ల్ మిస్సింగ్ కేసులు, పోక్సో కేసులు అధికంగా రిపోర్టు అవుతున్నాయి కావున మోసపూరితమైన మాటలతో ప్రలోభావానికి గురిచేసిన ప్రేమ పేరుతో వంచించిన వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోబడును అటువంటి వ్యక్తుల పై రౌడీషీటర్లు ఓపెన్ చేసి నిరంతరం నిఘా పెట్టబడుతుందని పత్రిక పూర్వకంగా తెలియజేశారు

# డాక్టర్ రమాదేవి వైద్య సేవలు అభినందనీయం

**రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత**



అనపర్తి జులై 4 (జి ఎస్ బి వార్త ) నియోజకవర్గ కేంద్రం అనపర్తిలో సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న రమాదేవి ఆసుపత్రిని శనివారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడిఅనిత , ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ళ జోగేశ్వరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం శాఖ మంత్రి మాట్లాడుతూ రమాదేవి ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ మీసాల రమాదేవి వైద్య సేవలను కొనియాడారు. గైనకాలజిస్ట్ గా రమాదేవి సుమారు 6000 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసి గుర్తింపు పొందారని పేర్కొన్నారు . రాబోయే రోజుల్లో విజయవంతంగా మరిన్ని డెలివరీ లు జరగాలని, అలాగే సాధారణ డెలివరీలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రతి పురుషుడు విజయం వెనుక స్త్రీ ఉంటుందని, రమాదేవి విజయం వెనుక ఆమె భర్త సతీష్ ఉన్నారని ప్రశంశించారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనపర్తిలో అధునాతనమైన ల్యాబ్ లు, ఆపరేషన్ థియేటర్లతో ఆసుపత్రిని నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దాదాపు 20 మంది డాక్టర్లను నియమించి వైద్య సేవలు నిరంతరం అందించే విధంగా ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, జిఎస్ఎల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణ రెడ్డి దంపతులు, యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, వివిధ హాస్పిటల్స్ చెందిన వైద్యులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నేటి తరం యువత అల్లూరి పోరాటస్ఫూర్తిని కొనసాగించాలి.


**అఖిలపక్షం,ఏపీ ఆదివాసీ జేఏసీ పిలుపు.**

**అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన నాయకులు.**



దేవీపట్నం,జూలై 4. జి ఎస్ బి వార్త : పోలవరం జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం,దేవీపట్నం మండల పరిధిలోని ఇందుకూరు గ్రామంలో అల్లూరి సీతారామరాజు 130 వ జయంతి సందర్భంగా ఘనంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అఖిలపక్షం,ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ...స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుడు అల్లూరి సీతారామరాజు ఆనాడు రంప ప్రాంతంలో ఇటువంటి కమ్యూనికేషన్,చదువు లేని ఆదివాసీ ప్రజలకు జరుగుతున్న అక్రమాలు,అన్యాయాలపై ప్రజలను చైతన్యం చేసి భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వాళ్ళని భారతదేశం నుండి తరిమికొట్టడంలో కీలకపాత్ర వహించారన్నారు.వీరితోపాటు గాం గంట దొర,గాం మల్లు దొర,మర్రి కామయ్య మొదలైన వారు ఎందరో పాల్గొని ప్రాణ త్యాగం చేశారన్నారు.మన్యం వీరుల్లో ఒకరైన అల్లూరి సీతారామరాజు నేటి తరం యువతీ యువకులకు స్ఫూర్తిదాయకమన్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తితో నేటితరం యువతీ యువకులు ఆదివాసీలపై జరుగుతున్న అన్యాయులపై,చట్టాలు హక్కులపై జరుగుతున్న దాడులు పై ఆదివాసీలంత ఐక్యంగా మరో మలిదశ శాంతియుత ఉద్యమానికి సిద్ధం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,ఏపీ ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అయినాల శ్రీనివాసు,ఆదివాసి మహాసభ జిల్లా అధ్యక్షులు మడకం బంగారు బాబు,జిల్లా ప్రధాన కార్యదర్శి అరగటి వీరభద్రారెడ్డి,అరగటి నాగిరెడ్డి,కెచ్చెల ముద్దులరెడ్డి,పచ్చుకూరి గౌరీ శంకర్,పచ్చుకూరి అర్జునుడు,మూలెం బుచ్చిరాజు,బందారి వీరబాబు,కోనపర్తి ప్రసాద్,మాలపర్తి ఈసు,మన్నేపల్లి కోటి,కొట్టెం బన్నీ,మాదాల షణ్ముఖ,ఈరేటి యువ కిరణ్ మొదలైన వారు పాల్గొన్నారు.

# ఎస్సై బొమిడి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ




ఐ. పోలవరం జులై 04 ( జియస్ బి వార్త) ఐ పోలవరం మండలం కరవాకలంక గ్రామానికి చెందిన ఎస్సై బొమిడి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ ఆత్మీయ సమావేశ సభ కాకినాడ సుబ్బయ్య ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులతో పాటు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎస్సై దంపతులను సాలువలతో సత్కరించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 38 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో పనిచేసే ఎంతమంది మన్ననలు పొందిన వ్యక్తి బొమిడి వెంకటేశ్వరరావు అని కొనియాడారు అంతేకాకుండా వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ కరవాకు లంక గ్రామ ప్రజలకు ఎంతో అండగా నిలిచారని తెలిపారు ఈ కార్యక్రమమునకు పలువురు నాయకులతోపాటు పోలీసు ఉన్నత అధికారులు పాల్గొని ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సమావేశంలో మాల మహానాడు అధ్యక్షులు రేవు శ్రీను వాకపల్లి శాస్త్రి ములపర్తి శ్రీను బాబు ఎలిపే రాజేష్ మట్ట గగనవీరుడు వడ్డీ గౌతమ్ కాటే సింహాద్రి బొమ్మిడి ఉపేంద్ర బొమ్మిడి ధనంజయలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు

# అప్పులపై భట్టి అసత్యాలు చెబుతున్నారు: హరీశ్ రావు

హైదరాబాద్, జులై 4: తెలంగాణ రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసత్యాలు చెబుతున్నారని, హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాల నుంచి, తమపై జరుగుతున్న డ్యామేజ్ నుంచి తప్పించుకునేందుకే భట్టి విక్రమార్క ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపారని, అందులో భాగమే ఇలా మాట్లాడుతున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

RNI AP BIL14872/2024
వార్త
05-07-2026

## అన్నవరంలో "అల్లూరి" జయంతి వేడుకలు




అన్నవరం, (జి యస్ బి వార్త), జూలై - 4 :అన్నవరం లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద గల మినీ పార్కులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఈసందర్భంగా ఘన నివాళులు అర్పించారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులు దొంకాడ గిరి మాట్లాడుతూ, "అల్లూరి సీతారామరాజు అంటే తెలుగు జాతి పౌరుషానికి ప్రతీకని,కేవలం 27 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ పాలకులకు నిద్రలేకుండా చేసిన మహా వీరుడన్నారు.అడవి బిడ్డల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తని, ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమన్నారు. అల్లూరి సీతారామరాజు "అన్నవరం,శంఖవరం మండలంలో పలు ప్రాంతాలలో పర్యటించి ఈ నేలను పునీతం చేసారని" నాటి స్మృతులను ఈసందర్భంగా గుర్తుకు తెచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ పొన్నాడ సూరిబాబు, కోశాధికారి బుడ్డిగ వాసు, పంచాది గుర్రాజు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక హత్యాచారం పై తక్షణం ధర్యాప్తు చేపట్టాలి...!

### వైసీపీ మహిళా నేతలు డిమాండ్



సామర్లకోట, జూలై 4, జి ఎస్ బి వార్త : పెద్దాపురం డివిజన్లో ఒక మైనర్ బాలికపై అత్యాచార ఘటన జరిగినట్లు వస్తున్న వార్తల వ్యవహారంపై ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేపట్టాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళ నేతలు డిమాండ్ చేశారు. సామర్లకోట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీ మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పెద్దాపురంలో ఒక మైనర్ బాలికపై జరిగిన ఘటనలో నేతలు, పోలీసుల పాత్ర పై తక్షణమే దర్యాప్తు చేపట్టాలన్నారు. పెద్దాపురం ఎస్సై మౌనిక బదిలీపై కూడా మహిళ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. మైనర్ బాలిక ఘటనలో ప్రధానంగా లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు పెద్ద ఎత్తున దూమరం చెలరేగటం ప్రభుత్వ వైఫల్యానికి దర్పణం అని శివకుమారి ధ్వజ మెత్తారు. మహిళల రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు పెద్దాపురం ఘటన కనిపించలేదా అంటూ మహిళ నేత మాకినీడి శివకుమారి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆమె తీవ్రంగా ధ్వజమెత్తారు. పెద్దాపురం ఘటనకు సంబంధించి ఆ కుటుంబాన్ని కూడా మాయం చేయటం విచిత్రమని మహిళా నేత వర్ధినిడి సుజాత అన్నారు. ఒక కోళ్ల ఫారం యజమాని చేసిన దాస్టికాన్ని కప్పిపుచ్చేందుకు పోలీసుల ద్వారా ప్రయత్నాలు సాగుతున్నట్లు కూడా మహిళా నేతలు ఆరోపించారు. హోంమంత్రి అనిత కూడా ఈ ఘటనపై స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. బాధిత కుటుంబాన్ని గుర్తించి, బాధితులకు అండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం సాగిస్తుందని మహిళ నేతలు స్పష్టం చేశారు.

### బీచ్ లో మద్యం వ్యాపారమా...?

సమాజానికి మంచి సందేశాత్మకంగా వ్యవహరిస్తూ, మహిళలకు రక్షణ కల్పించవలసిన ప్రభుత్వమే బీచ్ ప్రాంతాల్లో మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహిస్తుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పాలన వ్యాపార కేంద్రంగా మారుతుందన్నారు. కుటుంబ సమేతంగా బీచ్ కు వెళ్లే ప్రజలు మహిళలకు రక్షణ ఎక్కడ లభిస్తుంది అంటూ ప్రశ్నించారు. బీచ్ లో మద్యం అమ్మకాలు, ఇతర దుకాణాలు ఏర్పాటుపై ప్రభుత్వం తక్షణమే పున: పరిశీలన చేయాలని కూడా డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం సాగిస్తుందని కూడా హెచ్చరించారు. ఈ సమావేశంలో మహిళ నేతలు శివ ప్రసన్న, పేపకాయల కృష్ణప్రియ, దీప్తి కుమారి, సేపెని రూపా దేవి, పాలిక కుసుమ తదితరులు పాల్గొన్నారు.

## యువత అల్లూరి ని ఆదర్శంగా తీసుకోవాలి

సామర్లకోట, జూలై 4, జి ఎస్ బి వార్త : సామర్లకోట పట్టణంలో డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాలు శనివారం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా బళ్ళ మార్కెట్ సెంటర్లో, స్థానిక బలుసుల పేటలోని అల్లూరి విగ్రహాలకు పూలదండలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు బాలం శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల సమస్యలపై పోరాడుతూ గిరిజన హక్కుల కోసం బ్రిటిష్ సామ్రాజ్యం ఎదిరించి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారన్నారు. నేటి పాలకులు బాక్సైట్ గనులు కోసం కొండ కోనల నుంచి నేషనల్ హైవేస్ నిర్మించి ఆదానిలాంటి పెట్టుదారులు కు దారా దత్తం చేయడానికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. నేటి యువత అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం గోవిందరాజు, బాలం సత్తిబాబు, మూలయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శ కరణం ప్రసాదరావు, దళిత నాయకులు నేతల హరిబాబు, కరణం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



## తొలి తిరుపతిలో బిసీవై జాతీయ అధ్యక్షులు పూజలు



పెద్దాపురం, జూలై 4, జి ఎస్ బి వార్త : పెద్దాపురం మండలం తొలి తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శృంగార వల్లభ స్వామిని బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారి వడ్డి శ్రీనివాసరావు, ఆలయ పండితులు ఆలయ మర్యాదల చొప్పున ఆహ్వానం పలికారు. అనంతరం రామచంద్ర యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆయనకు అర్చకులు వేద ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్బంగా స్వామివారిని దర్శించుకున్న వారిలో బిసివై పార్టీ నాయకులు, రామచంద్ర యాదవ్ అభిమానులు ఉన్నారు.

## ప్రత్యేక అధికారులు లేరా? ఇంకా నియమించలేదా?

### మూడు గ్రామ సచివాలయలో ప్రత్యేక అధికారులు లేక ప్రజలు ఇబ్బందులు




ఐ. పోలవరం జులై 04 ( జియస్ బి వార్త) ఐ. పోలవరం మండలంలోని మొత్తం 14 గ్రామాల్లో సుమారు 18 గ్రామా సచివాలయలయలు ఉన్నాయి సర్పంచ్ పదవి కాలం ముగియడంతో పాలన స్వలభ్యం కోసం ప్రజల పనులకు అనుగుణంగా అధికారులు ఆయా గ్రామ సచివాలయలకు ప్రత్యేక అధికారులను నియమించారు కానీ కొన్ని గ్రామాల్లో సచివాలయంలో ప్రత్యేక అధికారులు పోస్టు ఖాళీ అయినా ఇంకా పోస్టు భర్తీ చేయలేదు భైరవ పాలెం గ్రామ సచివాలయంలో ఇంతకుముందు ఉన్న అధికారి రిటర్డ్ అయినా ఆస్థానంలో ఇంకా ప్రత్యేక అధికారి ని నియమిచలేదు దాని వెనుక మర్మ మేమిటో మండల అధికారులకే తెలియాలి అలాగే టి కొత్తపల్లి జి.ములపాలెం తిల్లా కుప్ప గ్రామ సచివాలయంలో కూడా ప్రత్యేక అధికారులు నియమిచలేదు అని దానివలన మా పనుల జాప్యం జరుగుతోందని ఆయా గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి ప్రత్యేక అధికారులు నియమిచాలని ప్రజలు కోరుతున్నారు

## మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళులర్పించిన కంబాల

### సీఎండీ లేఅవుట్లో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు....




గోకవరం జూలై 4 జి ఎస్ బి వార్త : తూర్పుగోదావరి జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం గోకవరం గ్రామంలోని సీఎండీ లేఅవుట్ వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కంబాల శ్రీనివాసరావు గారు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని అన్నారు. ఆయన చూపిన దేశభక్తి, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు రామసేన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో చిరుత కలకలం.. ఇంట్లోకి చొరబడేందుకు యత్నం..

తిరుపతి, జులై 4: ఇటీవల కాలంలో ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి పరిసర ప్రాంతాల్లో చిరుత పులుల సంచారం స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. తాజాగా.. రేణిగుంట మండలం వెంకటాపురం గ్రామంలో అర్ధరాత్రి వేళ ఓ చిరుతపులి జనావాసాల్లోకి రావడం స్థానికంగా కలకలం రేపింది. ఆహారం, నీటి అన్వేషణలో భాగంగా అడవి నుంచి బయటకు వచ్చిన ఆ చిరుత.. గ్రామంలోని ఓ ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించింది. చిరుతను గమనించిన ఇంటి కుటుంబ సభ్యులు.. గట్టిగా కేకలు వేయడం ప్రారంభించారు. దీంతో చిరుతపులి అక్కడి నుంచి పారిపోయింది. ఎట్టకేలకు చిరుత వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇదిలా ఉంటే.. చిరుతపులి సంచారానికి సంబంధించిన దృశ్యాలన్నీ ఆ ఇంటి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. అర్ధరాత్రి వేళ చిరుత పిల్లిలా నక్కినక్కి రావడం, ఇంట్లోకి దూరాలని చూడటం ఆ ఫుటేజీలో కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని పరిశీలించారు. ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా తిరగవద్దని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. చిరుతను పట్టుకునేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

## వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన తుమ్మలపల్లి



గోకవరం జులై 4: జి ఎస్ బి వార్త : జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం గోకవరం టౌన్ రంగా సెంటర్‌లో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ, ప్రజల హక్కుల కోసం నిర్భయంగా పోరాడిన ధైర్యవంతుడైన నాయకుడు వంగవీటి మోహన్ రంగా గారని కొనియాడారు. ఆయన ప్రజాసేవ, పోరాట పటిమ, నిబద్ధత నేటి రాజకీయ నాయకులకు, యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజల కోసం అంకితభావంతో జీవించిన మహానేత వంగవీటి మోహన్ రంగా గారి ఆశయాలను స్మరించుకుంటూ, సమాజ హితం కోసం మరింత బాధ్యతతో సేవలందిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో దోసపాటి సుబ్బారావు,పడాల చిన్నా,కోటేష్ ఆచంట బాబీ,గుల్లంపూడి ఆనంద్ ఉంగరాల శివాజీ,సంద్రు బుచ్చిరాజునారా సూర్య, కురుమల్ల నాగేశ్వరరావు, పాఠం శెట్టి రమేష్, కాయల మణికంఠ, గోకేడ ప్రసాద్, రేళ్ళ ప్రసాద్ తదితరులు ఉన్నారు

## జగన్మోహనం భక్తజన పరమానందం



ఆత్రేయపురం (జీ ఎస్ బి వార్త) జూలై 4 : భక్తజన వరదా... చందన స్వరూప నమోస్తుతే అంటూ భక్తుల స్వరంతో శనివారం కోనసీమ తిరుమల వాడపల్లి పులకించింది. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీమన్నారాయనుడు దివ్యాలంకార శోభితుడై జగన్మోహనంగా దర్శనమిచ్చారు. ఏడు వారాల నోము ఆచరించే భక్తజనంతో శ్రీవారి ఆలయం కిటకిటలాడింది. మాడవీధుల్లో ప్రదక్షిణలు, స్వామి వారి మూలవిరాట్టు , ఆరుబయట విమాన వెంకటేశ్వర స్వామి, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఆండాళ్ అమ్మవారు, విశ్వేశ్వర స్వామి దర్శనాలతో భక్తులు పొందారు. తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత సేవ అనంతరం ప్రారంభమైన దర్శనాలు రాత్రి 9 గంటల వరకు కొనసాగాయి. భక్తులకు దర్శనాలలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, ఆలయ చైర్మన్ ముదునూరు వెంకట్ రాజు దగ్గరుండి పర్యవేక్షించారు.

## జనసేన నిర్మాణ సారధుల కమిటీకి అర్జీని సమర్పించిన అడపా శ్రీనివాస్..



కోరుకొండ జూలై 4 (జి ఎస్ బి వార్త) : గ్రామస్థాయిలో కార్పొరేటర్ స్థాయిలో జిల్లా స్థాయిలో రాష్ట్ర స్థాయిలో పోరాడే నాయకులు సేవ కార్యక్రమాలు చేసే నాయకులు పార్టీకి కష్టపడి పనిచేసిన నాయకులే నా జనసేన పార్టీకి కావాలి అని ఒకప్పుడు మాట్లాడిన పవన్ కళ్యాణ్ ఆ మాటకి కట్టుబడి ఇవాళ 25 జిల్లాలలో మరియు పార్లమెంటు స్థానాలలో జనసేన నిర్మాణ సారధులు సమాచార సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి అబ్జర్వర్ లను నియమించి కష్టపడిన జనసైనికులను వాళ్లకు కావలసిన పదవులను అర్జీ రూపంలో తీసుకుని వాళ్ళ యొక్క పోరాటపటిమను సేవా కార్యక్రమాలను అర్జీ రూపంలో తెలియపరచండి అని అర్జీలను తీసుకొని రేపు రాబోయే రోజుల్లో పార్లమెంటు జిల్లా మరియు గ్రామ మండల స్థాయిలో అర్హత కలిగిన వాళ్ళందరికీ కూడా పదవులు ఇచ్చే విధంగా రాష్ట్ర నాయకత్వం జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ తీసుకునే నిర్ణయం భారతదేశంలో ఎక్కడ జరగలేని విధంగా. కొత్త ధనాన్ని తీసుకొచ్చినటువంటి.. పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక అభినందనలను అడపా శ్రీనివాస్ తెలియజేశారు.

## వాడపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సినీ దర్శకుడు హరిశంకర్

ఆత్రేయపురం ( జి ఎస్ బి వార్త) జూలై 4 : కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ దర్శకుడు హరీష్ శంకర్ ఈరోజు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీ స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి ఆశీస్సులు పొందారు.



# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి:

**జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్**



అమలాపురం జూలై 4:(జిఎస్ బి వార్త) : స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 129 వ జయంతి వేడుకలను శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం స్థానిక కలెక్టరేట్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నందు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ పూల మాలలు వేసి ఘనశీగా నివాళులర్పించారు.? ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో అల్లూరి సీతా రామరాజు జరిపిన పోరాటం చిరస్మరణీయమన్నారు. బ్రిటిష్ వారి నిరంకుశ పాలనకు, గిరిజనులపై జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా చిన్న వయసులోనే ఆయన విప్లవ శంఖం పూరించారన్నారు. మన్యం ప్రజల హక్కుల కోసం, మాతృభూమి విముక్తి కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన ధీశాలి అల్లూరి అన్నారు. యువతకు స్ఫూర్తిప్రదాతనీ అల్లూరి చూపిన దేశభక్తి, ధైర్యం నేటి యువతకు ఆదర్శమని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.? గిరిజన అభ్యున్నతి కి కృషి చేశారన్నారు. మన్యం ప్రజల బాగు కోసం పోరాడిన అల్లూరి ఆశయాలకు అనుగుణంగా జిల్లా లోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆశయ సాధనే నిజమైన నివాళిగా మహనీయుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారు ఆశించిన సమాజ స్థాపన కోసం నిరంతరం శ్రమించడమే మనం వారికిచ్చే నిజమైన నివాళిని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోశీ నైదియాదేవి ప్రసంగిస్తూ సీతారామ రాజు గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా అసమాన పోరాటం సాగించిన మహనీయుడన్నారు. ఆయన జీవితగాథ దేశభక్తి, త్యాగం, నిబద్ధత, ధర్మబద్ధమైన పోరాటానికి చిరస్మరణీయంగా నిలిచాయన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ముఖ్యంగా యువత ఆయన ఆదర్శాలను ఆచరణలో పెట్టుకొని సమాజ సేవ, దేశ సేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, ధైర్యసాహసాలు, సేవా తత్వం వంటి విలువలు అల్లూరి జీవితం ద్వారా స్పష్టమవుతాయని పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా ప్రజలందరూ జాతీయ చైతన్యాన్ని మరింత బల పరచుకో వాలని, దేశ అభ్యున్నతికి తమ వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వి.సుబ్బారావు. కలెక్టరేట్ ఏవో నాగలక్ష్మమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు



కాకినాడ, (జిఎస్ బి వార్త ): మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు గారి 129వ జయంతి సందర్భంగా కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కాకినాడ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ జి. బిందుమాధవ్, ఐపీఎస్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని అల్లూరి సీతారామరాజు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు గారు దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడని, ఆయన ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగనిరతి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మన్యం ప్రజల హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటం భారత స్వాతంత్ర్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ గారు, అడిషనల్ ఎస్పీ (ఏ ఆర్) శ్రీ ఎస్ శ్రీనివాసరావు గారు, ఎస్బి డిఎస్పీ శ్రీ కెవివి సత్యనారాయణ గారు, ఏ ఆర్ డిఎస్పీ శ్రీ వి జి శ్రీహరి రావు గారు, ఇతర పోలీసు అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొని మన్యం వీరుడికి ఘనంగా నివాళులు అర్పించారు.

# ర్యాలీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారి దేవస్థానానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం ( జి ఎస్ బి వార్త) జూలై 4 : ఆత్రేయపురం మండలం, ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి దేవస్థానం నకు భక్తులు విశేషంగా విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకొని, దేవస్థానం నందు జరుగు నిత్యాన్నదానంలో అన్నదానం పాల్గొన్నారు మరియు ర్యాలి గ్రామస్థులు లలితా పారాయణదారులు శ్రీ లలితా సహస్రనామ, శ్రీ మణిద్వీప పారాయణలు చేసియున్నారు. శ్రీ స్వామి వారి సేవలో మెర్ల నాగేశ్వరరావు, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు మరియు కార్యనిర్వాహణాధికారి




# ఏ ఎస్ ఆర్ స్టేడియంలో ఘనంగా అల్లూరి సీతారామరాజు 129 జయంతి వేడుకలు



ఏలూరు స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం మొదట గేటు దగ్గర శనివారం నాడు అల్లూరి సీతారామరాజు వారి129 వ జయంతి వేడుకలను వాకర్స్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు విశాఖపట్నం జిల్లా పాండ్రంగి గ్రామంలో1897జులై 4వ తేదీన జన్మించారని,వారు చిన్ననాటి నుండి ఎంతో దైవభక్తి కలిగి ఉండేవారని,వారికి నాయకత్వ లక్షణాలు,దానగుణం ఉండేదని అన్నారు.ఆ రోజుల్లో ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దోపిడీలకు,అన్యాయాలకు గురయ్యేవారిని అలాంటివారికి అండగా నిలిచేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.అల్లూరి సీతారామరాజు వారి స్ఫూర్తితో ఏ ఎస్ ఆర్ స్టేడియం వాకర్స్ సభ్యులు అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుకు మమ్ములను కలవగా,వాకర్స్ వారి ప్రతిపాదనను శనివారం పేట రాజుల దృష్టికి తీసుకువెళ్లగా వారు వెంటనే సానుకూలంగా స్పందించారు.రాజుల సౌజన్యంతో విగ్రహాన్ని గత సంవత్సరం ఇదే రోజున ఏర్పాటు చేయడమైనది అన్నారు.అప్పటినుండి వాకర్స్ అధ్యక్షులు పత్తిపాటి నాగ విఘ్నేశ్వర రావు మరియు వారి వాకర్స్ మిత్రబృందం పర్యవేక్షణలో ఎంతో చక్కగా విగ్రహం దగ్గర పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండటంతో వాకర్స్ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.అనంతరం అల్లూరి సీతారామరాజు విగ్రహానికి గజమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షులు పత్తిపాటి నాగ విఘ్నేశ్వర రావు ఎం జి ఎఫ్,గోల్డెన్ డోనర్ ఎస్ ఎం అక్బర్,విశ్వనాథం మాధవరావు,కొమ్మా నాగరాజు,వాకర్స్ మహిళా అధ్యక్షురాలు తానికొండ మేరీ మాణిక్యం,జంపా సూర్యనారాయణ,యేసు,మరడాని అచ్యుతరావు,జల్లా వీరభద్రరావు,ఎస్.కె సత్తార్,సామాజిక వేత్త గొంతిన రామకృష్ణ,జొన్నాడ రాంబాబు,ఎం రామలింగేశ్వర రావు,ఎన్.కె లాల్ సాహెబ్,పెద్దపాటి జగదీశ్వరరావు,నజీర్,భౌరోతు బాలాజీ,పళ్ళ అప్పారావు,కాశి,రవి,వివిధ క్రీడల కోచులు,వివిధ క్రీడాకారులు,అధిక సంఖ్యలో మహిళా వాకర్ సభ్యులు పాల్గొని అల్లూరి సీతారామరాజు వారికి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం పత్తిపాటి విగ్నేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విచ్చేసిన ఎమ్మెల్యే వారికి ఏలూరు నగరపుర ప్రముఖులకు,శనివారం పేట రాజులకు,కూటమి ప్రభుత్వ నాయకులకు,కార్యకర్తలకు,తోటి వాకర్స్ మిత్రులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలను తెలిపారు.

# సత్యదేవ జూనియర్ కళాశాలలో ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



అన్నవరం: (జి యస్ బి వార్త),జూలై –4 : మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని,శనివారం సత్యదేవ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ ముఖ్య అతిథిగా విచ్చేసి, అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఆయన పోరాట పటిమ నేటి విద్యార్థులకు ఆదర్శప్రాయమన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగం, చూపిన తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎమ్ గంగా సూరిబాబు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ పాలనపై సాగించిన పోరాటాన్ని, ముఖ్యంగా 'మన్యం విప్లవం' వెనుక ఉన్న త్యాగాన్ని వివరించారు.స్వరాజ్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని అల్లూరి ఆశయసాధనకు నేటి విద్యార్థులు కృషి చెయ్యాలని,అన్యాయాన్ని ఎదిరించే సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.సత్యం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# డా. చిరంజీవినీ కుమారి కాంస్య విగ్రహా ఏర్పాటుకు పనులు ప్రారంభించిన కాలేజీ సిబ్బంది



కాకినాడ జూలై 4,(జిఎస్ బి వార్త) ఎందరికో విద్యాబుద్ధులు నేర్పిన ప్రముఖ విద్యావేత్త, సంఘ సేవకురాలు యావత్ కాకినాడ ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన డాక్టర్ చిరంజీవిని కుమారి విగ్రహం ఏర్పాటు చేసేందుకు కాకినాడ విద్యుత్ నగర్ ఐడియల్ కాలేజీ ప్రాంగణంలో ఈ నెల 19న ఆవిడ వద్ద చదువు నేర్చుకున్న ఆవిడతో పాటు విద్యార్థులు నేర్పించిన అధ్యాపకులు అందరి సమక్షంలో నిలువెత్తు విగ్రహాన్ని స్థాపించేందుకు చురుకుగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి వివిధ దేశాల్లో ,వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి వస్తారని కాలేజీ సిబ్బంది తెలిపారు.



# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ధైర్యసాహసాలు, నేటి తరం యువతకు ఆదర్శం

**జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్**



కాకినాడ, (జిఎస్ బి వార్త ) : స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కాకినాడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎంపి సానా సతీష్ బాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కౌడా చైర్మన్ తలాటం సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, ప్రజాప్రతినిధులు, క్షత్రియ సమాజ పెద్దలు స్థానిక నాగమల్లితోట జంక్షన్ లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ,భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వీరోచిత పోరాటాలతో తెల్లదొరల గుండెల్లో నిద్రపోయి, మన్యం ప్రజల హక్కుల కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నిస్వార్ధ త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అల్లూరి ఆదర్శంగా సమాజంలో ప్రతి పౌరుడికి హక్కులు కల్పించేందుకు, వెనుకబడిన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాడు అడవులను అల్లూరి ఎలా సంరక్షించారో, నేటి తరం కూడా అదే స్ఫూర్తితో పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. అల్లూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత దేశ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలందరికీ అల్లూరి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ మాట్లాడుతూ, గిరిజనుల, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మన్యం వీరుడు అల్లూరి దేశ స్వాతంత్ర్యానికి దిక్సూచిగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అల్లూరి ఆశయాలకు కట్టుబడి ఉందన్నారు. అమరావతిలో అల్లూరి చరిత్రను భావితరాలకు తెలియజెప్పేలా భూమిని కేటాయించడం, అలాగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేయడం అల్లూరి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. క్షత్రియ సామాజిక వర్గ సంక్షేమానికి, వారి సామాజిక సేవా కార్యక్రమాలకు ఈ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటోందని, రాజకీయంగా కూడా పెద్దపీట వేస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేసారు. దేశ ప్రజల స్వేచ్ఛ కోసం ప్రణాలర్పించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నిరుపమాన త్యాగాన్ని జాతి ఎన్నటికీ మరువదని ఎంపి సానా సతీష్ బాబు, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఎస్డిఓ వి. సతీష్ కుమార్ స్థానిక నాయకులు, క్షత్రియ అసోసియేషన్ ప్రతినిధులు, నగర ప్రముఖులు, యువత, విద్యార్థులూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అలియన్స్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలు



కాకినాడ, (జిఎస్ బి వార్త ) : కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలు నిర్వహించారు.

అలియన్స్ క్లబ్ అధ్యక్షులు అలై. యాళ్ళ రత్నారావు మరియు క్లబ్ వ్యవస్థాపకులు అలై. దిలీప్ కుమార్ సధనాని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్లబ్ సభ్యులు పుష్పాంజలి ఘటించి మహనీయుడికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు అలై. యాళ్ళ రత్నారావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగాలు, దేశభక్తి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. క్లబ్ వ్యవస్థాపకులు అలై. దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సమరంలో చూపిన ధైర్యసాహసాలు చిరస్మరణీయమని తెలిపారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశసేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అలై. కొవ్వూరి మునిరెడ్డి, అలై. బండారు భాస్కరరావు, అలై. నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అలై. దామిశెట్టి శ్రీనివాసరావు, అలై. దొడ్డి వీరేంద్ర, అలై. కళా శ్రీలక్ష్మి, అలై. మల్లాడి ఈశ్వరి, అలై. మల్లాడి మృణాల్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు 129 వ జయంతి

కరప (జిఎస్ బి వార్త) : కరప ఎంపీడీఓ కార్యాలయం లో కరప మండల పరిషత్ నందు అమర స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 129 వ జయంతి సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయము, కరప నందు వారి చిత్రపటమునకు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు . ఈ కార్యక్రమములో మండల అధ్యక్షులు పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు , ఏపీ ఓ ఆర్. ప్రభాకర రావు , సీనియర్ సహాయకులు టి. సుబ్రహ్మణ్యం, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



Printed&published by on behalf (owner) Editor : GUNIPE SOBHAN BABU , Divya Publications, 4-160, DIWAN THOTA, PENUGUDURU, KAKINADA, ANDHRA PRADESH - 533016. printed at Rainbow printers ,6-84, SAIBABAPUNTHA ROAD, HUKUMPETA, RAJAHMUNDRY RURAL, EAST GODAVARI, ANDHRA PRADESH - 533107.RNI APBIL/26/A4072.email sobhangunipe@gmail.com.cell 9848899351.



# సినీ కబుర్లు

## మెగా ఫెస్ట్ ఎప్పుడో.. బర్త్‌డేకి క్లారిటీ వచ్చేనా?



మెగాస్టార్ చిరంజీవి ఈ ఏడాది 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో వచ్చి సూపర్ హిట్‌ను దక్కించుకున్న విషయం తెల్సిందే. ఇదే ఏడాది చిరంజీవి మోస్ట్ అవైటెడ్ మూవీ 'విశ్వంభర' సైతం విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మెగా ఫ్యాన్స్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు చిరంజీవి నటించిన సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర' పై అంచనాలు భారీగా పెట్టుకుని మరీ ఎదురు చూస్తున్నారు. బింబిసార దర్శకుడు రూపొందించిన విశ్వంభర సినిమా గురించి ప్రారంభం అయినప్పటి నుంచి అంచనాలు పెరుగుతూ వచ్చాయి. అయితే మధ్యలో సినిమా వాయిదాల పర్వంలో పడటం, వీఎఫ్ఎక్స్ విషయంలో ట్రోల్స్ రావడంతో విశ్వంభర క్రేజ్ తగ్గుతూ వచ్చింది. అయితే సినిమా విడుదల సమయంకు కచ్చితంగా చిరంజీవి మేజిక్ తో మంచి హైప్ క్రియేట్ అవుతుందని మేకర్స్ నమ్ముతున్నారు. చిరంజీవి విశ్వంభర సినిమా రిలీజ్... రెగ్యులర్ ఆడియన్స్ విషయం పక్కన పెడితే మెగా ఫ్యాన్స్ 'విశ్వంభర' సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చిరంజీవి జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమా తర్వాత చేసిన సోషియో ఫాంటసీ మూవీ ఇదే కావడంతో మెగా ఫ్యాన్స్ ఆశలు పెట్టుకున్నారు. సరికొత్త లోకాలను చూపిస్తాను అంటూ దర్శకుడు గతంలో చేసిన వ్యాఖ్యలు సైతం అంచనాలు పెంచాయి. హీరోయిన్‌గా త్రిష నటించిన విషయం తెల్సిందే. మొన్నటి వరకు దసరా కానుకగా విశ్వంభర వస్తుందనే వార్తలు వచ్చాయి. కానీ వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తి కాలేదంటూ మళ్లీ అదే పాట పాడుతున్నారు. విశ్వంభర కొత్త విడుదల తేదీ విషయమై స్పష్టత కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదే సమయంలో చిరంజీవి, బాబీ కాంబోలో ప్రారంభం అయిన సినిమా విడుదల విషయమై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. బాబీ దర్శకత్వంలో చిరంజీవి రెండో సినిమా... ఈ రెండు సినిమాల విడుదల తేదీల విషయమై స్పష్టత కోసం మెగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చిరంజీవి సినిమా విడుదల అంటే మెగా ఫ్యాన్స్‌కి మాత్రమే కాకుండా తెలుగు సినిమా ప్రేక్షకులు అందరికీ పండుగ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆ పండుగ ఎప్పుడు ఉంటుందా అని అంతా ఆసక్తిగా చిరంజీవి వైపు చూస్తున్నారు. వచ్చే నెలలో చిరంజీవి బర్త్‌డే సందర్భంగా ఈ రెండు సినిమాలకు సంబంధించిన విడుదల తేదీలపై స్పష్టత వస్తుందని అభిమానులు అనుకుంటున్నారు. ఇప్పటికే చిరంజీవి, బాబీ కాంబో మూవీ షూటింగ్ ప్రారంభం కావడం, చకచక పనులు జరగడం మనం చూస్తూనే ఉన్నాం. కనుక సర్‌ప్రైజింగ్ పోస్టర్ లేదా టీజర్‌ను బాబీ ప్లాన్ చేస్తున్నాడు. అంతే కాకుండా షూటింగ్ అప్డేట్ ఇచ్చి విడుదల తేదీ విషయంలో స్పష్టత ఇవ్వనున్నట్లు సమాచారం అందుతోంది. 2027 సంక్రాంతికి ఈ సినిమా విడుదల చేయాలని మెగా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు విశ్వంభరలో చిరుకు జోడీగా త్రిష... చిరంజీవి-బాబీ కాంబోలో గతంలో వచ్చిన వాల్తేరు వీరయ్య మూవీకి మంచి స్పందన వచ్చింది. కనుక మళ్లీ హిట్ బొమ్మ ఖాయం అని మెగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. అందుకే వీరి కాంబో మూవీ సైతం త్వరగా రావాలని కోరుకుంటున్నారు. విశ్వంభర సినిమా విడుదల ఈ ఏడాదిలోనే ఉంటే, బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న చిరంజీవి మూవీ వచ్చే ఏడాది ఆరంభంలోనే విడుదల అయ్యే అవకాశం ఉంది. ఒకవేళ విశ్వంభర సినిమా ఈ ఏడాది కూడా రాలేక పోతే, అప్పుడు బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ముందు వచ్చే అవకాశం ఉంది. ఈసారి కనుక విశ్వంభర వాయిదా పడితే మెగా ఫ్యాన్స్ సైతం సినిమా గురించి మర్చి పోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఫలితం ఎలా ఉన్నా విశ్వంభర, బాబీ మూవీ రెండూ తక్కువ గ్యాప్‌లో రావాలని, మెగా పండుగ జరుపుకోవాల్సిందే అని అంటున్నారు. మరి చిరంజీవి బర్త్‌డేకి మెగా ఫెస్ట్ డేట్స్ అనౌన్స్ అయ్యేనా చూడాలి.




## శ్రీనివాసకి మహేష్ బాబు సపోర్ట్ దక్కేనా?



సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో హీరో తెలుగు సిల్వర్ స్క్రీన్ పై తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయ్యాడు. సూపర్ స్టార్ కృష్ణ పెద్ద కుమారుడు రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా తెలుగు తెరకి పరిచయం కాబోతున్నాడు. అజయ్ భూపతి దర్శకత్వంలో అశ్విని దత్ నిర్మాణంలో జయకృష్ణ హీరోగా రాబోతున్నాడు. 'శ్రీనివాస మంగాపురం'తో జయకృష్ణను అజయ్ భూపతి ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్న విషయం అందరికీ తెలిసిందే. కొన్ని కారణాల వల్ల వాయిదాలు పడుతూ వచ్చిన 'శ్రీనివాస మంగాపురం' సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాను జులై 30న విడుదల చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన చేశారు. క్యూట్ లవ్ స్టోరీతో పాటు, యాక్షన్ ఎలిమెంట్స్, కమర్షియల్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఈ సినిమాలో ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. మహేష్ బాబు సోదరుడి కొడుకు మూవీ... మహేష్ బాబు సోదరుడి కొడుకు అయిన జయకృష్ణ ఇండస్ట్రీలో అడుగు పెడుతున్నాడు అనగానే కృష్ణ అభిమానులు రమేష్ బాబును గుర్తు చేసుకున్నారు. రమేష్ బాబు ఇండస్ట్రీలో ఆశించిన స్థాయిలో నిలదొక్కుకోవడంలో విఫలం అయ్యాడు. కానీ ఆయన కొడుకు జయకృష్ణ కచ్చితంగా స్టార్ హీరోగా నిలుస్తాడని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. కృష్ణ ఫ్యామిలీ నుంచి ఏ హీరో ఎంట్రీ ఇచ్చినా కచ్చితంగా మహేష్ బాబు మద్దతు ఉంటుంది. గతంలో కృష్ణ ఉన్న సమయంలో కచ్చితంగా తన ఫ్యామిలీ హీరోలకు మద్దతుగా నిలిచేవాడు. కానీ ఆయన చనిపోయిన తర్వాత ఆ బాధ్యత పూర్తిగా మహేష్ బాబుపై పడింది. సుధీర్ బాబు లేదా మరే హీరో మూవీ వచ్చినా కూడా మహేష్ బాబు ముందు ఉండి ఫ్యాన్స్ కు పరిచయం చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పుడు జయకృష్ణ ను సైతం అభిమానులకు మహేష్ బాబు పరిచయం చేయాలని అంతా కోరుకుంటున్నారు. జయకృష్ణ హీరోగా తెలుగు ఇండస్ట్రీకి పరిచయం... జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్న 'శ్రీనివాస మంగాపురం' సినిమాకు మహేష్ బాబు ఖచ్చితంగా వంద శాతం సహకారం అందించి, తన వంతు ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. కానీ ప్రస్తుతం మహేష్ బాబు వారణాసి సినిమా షూటింగ్‌లో ఉన్నాడు. ఆ సినిమా టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతుంది అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రాజమౌళి దర్శకత్వంలో ఏ హీరో సినిమా చేసినా కూడా ఆ హీరో మీడియా ముందు ఎక్కువగా కనిపించకూడదు. అంతే కాకుండా పబ్లిక్ ఈవెంట్స్ లో ఎక్కువగా మాట్లాడకూడదు, అసలు పబ్లిక్ ఈవెంట్స్‌కి ఎక్కువగా హాజరు కాకూడదు అని కండీషన్స్ ఉంటాయి. కనుక మహేష్ బాబును శ్రీనివాస మంగాపురం కోసం రాజమౌళి పంపిస్తాడా లేదా అనే అనుమానాలను ఫ్యాన్స్‌తో పాటు ఇండస్ట్రీ వర్గాల వారు, మీడియా వారు వ్యక్తం చేస్తున్నారు. రాషా తడానీ హీరోయిన్‌గా 'శ్రీనివాస మంగాపురం' ఒకటి రెండు ఈవెంట్స్‌కి మహేష్ బాబు హాజరు అయ్యి జయకృష్ణను పరిచయం చేసి, సినిమా గురించి రెండు ముక్కలు మాట్లాడితే జరగాల్సిన పని అంతా అదే జరిగి పోతుందని విశ్లేషకులు అంటున్నారు. తండ్రిలేని బిడ్డ కనుక జయకృష్ణకు మహేష్ బాబు సహకారం చాలా అవసరం. తండ్రి స్థానంలో మహేష్ బాబు నిల్చుని జయకృష్ణను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయాలని, అందుకోసం అయినా మహేష్ బాబుకు రాజమౌళి సమయం ఇవ్వాలని, అనుమతించాలని అభిమానులు కోరుకుంటున్నారు. రాజమౌళి నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తేనే జయకృష్ణకు మహేష్ బాబు సపోర్ట్ దక్కుతుందని అంటున్నారు. ఇక ఈ సినిమాలో జయకృష్ణకు జోడీగా బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ హీరోయిన్‌గా నటించింది. టాలీవుడ్‌లో రాషా ఎంట్రీతోనే మంచి క్రేజ్ దక్కించుకోవడం ఖాయం అని, టాలీవుడ్‌తో పాటు అన్ని భాషల ఇండస్ట్రీల్లోనూ రాషా భవిష్యత్తులో స్టార్‌గా వరుస సినిమాలు చేయబోతుందని ఆమె సన్నిహితులు నమ్మకంగా ఉన్నారు. ఈ సినిమాకు జీ వీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందించాడు. తిరుపతి నేపథ్యంలో సాగే ఈ సినిమాలో మంచి ప్రేమ కథతో పాటు, యాక్షన్ ఎలిమెంట్స్ ఉంటాయని మేకర్స్ బల్లగుద్ది మరీ చెబుతున్నారు.

## సినిమాలు కాదు ఇంస్టాగ్రామ్ ద్వారా భారీ ఆర్జన





ఒకప్పుడు సెలబ్రిటీలకు సంపాదన అంటే సినిమాలు, బ్రాండ్ ప్రకటనలు, బిజినెస్ అంటూ కొన్ని మార్గాలను చెప్పేవారు. అయితే ఇప్పుడు వారు కేవలం తమ ఫోటోలు, బ్రాండ్స్ పోస్టుల ద్వారా కూడా ఆదాయాన్ని పెంపొందించుకుంటున్నారు అంటే ఆశ్చర్యపోకమానరు.. సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత అందులో మరీ ముఖ్యంగా ఇన్స్టాగ్రామ్ సెలబ్రిటీలకు ఆదాయ వనరుగా మారిపోయింది. సినిమాల ద్వారా వచ్చిన గుర్తింపును ఇన్స్టాగ్రామ్ వేదికగా ఉపయోగించుకుంటూ ఆదాయాన్ని పెంపొందించుకుంటున్నారు. సోషల్ మీడియా ద్వారా భారీ ఆదాయం.. ఇకపోతే సినిమాల ద్వారా కంటే కూడా ఇలా సోషల్ మీడియా ప్లాట్ఫారం ద్వారా అత్యధికంగా ఆదాయాన్ని పొందుతున్న సెలబ్రిటీస్ లో జాన్వీ కపూర్ ప్రథమ స్థానంలో నిలుస్తుంది అనడంలో సందేహం లేదు. బాలీవుడ్లో స్టార్ హీరోయిన్గా పేరు దక్కించుకొని.. ఇటు తెలుగులో సినిమాలు చేస్తూ దూసుకుపోతున్న ఈమె ఇంస్టాగ్రామ్ లో 2.68 కోట్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఎక్స్ వంటి ఇతర సోషల్ మీడియా వేదికలలో కూడా ఈమెకు మంచి ఆదరణ ఉంది. ఇక అలా ఫాలోవర్స్ ను బిజినెస్ గా మలుచుకోవడంలో సక్సెస్ అయ్యింది జాన్వీ కపూర్. ఈ నేపథ్యంలోనే దేశీయ, అంతర్జాతీయ స్థాయి బ్రాండ్లు తమ ఉత్పత్తుల బ్రాండ్ అంబాసిడర్ గా ఈమెను ఎంపిక చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇక సోషల్ మీడియా అకౌంటు, ప్రముఖ కంపెనీలకు అత్యంత విలువైన డిజిటల్ ప్రమోషన్ వేదికలుగా మారాయి అనడంలో సందేహం లేదు. ఒక్క పోస్ట్ కి ఎన్ని లక్షలంటే.. ఇకపోతే ట్రేడ్ వర్గాల నుండి అందుతున్న సమాచారం ప్రకారం.. జాన్వీ కపూర్ తన ఇంస్టాగ్రామ్ ఖాతాలో ఒక్క ప్రమోషనల్ పోస్ట్ పెడితే.. బ్రాండ్ విలువను బట్టి సుమారుగా రూ.8 నుండి రూ.11 లక్షల వరకు పారితోషకం తీసుకున్నట్లు సమాచారం. అలాగే ఎక్స్ వేదికగా చేసే ఒక్కో బ్రాండెడ్ పోస్ట్ కి సుమారుగా రూ.5 నుండి రూ.8లక్షల వరకు ఛార్జ్ చేస్తున్నట్లు సమాచారం. ఇకపోతే కేవలం పోస్టులు మాత్రమే కాకుండా ప్రముఖ బ్రాండ్లతో ఒప్పందాలకు కూడా అదనంగా ఛార్జ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలకు కోటిన్నరకి పైగా ఆదాయం.. ఇకపోతే తుమీ, హావెల్స్, లెన్స్ కార్ట్, ఒప్పో వంటి ప్రముఖ సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్న ఈమె.. ఈ ఒప్పందాల ద్వారా ఏడాదికి కోట్ల రూపాయలు సంపాదిస్తున్నట్లు సమాచారం. పైగా ప్రతినెలా బ్యూటీ, ఫ్యాషన్, లైఫ్ స్టైల్ , గాడ్జెట్స్, టెక్నాలజీ ఉత్పత్తులకు సంబంధించిన అనేక బ్రాండ్ ప్రమోషన్లు ఈమె సోషల్ మీడియా ఖాతాలో కనిపిస్తూ ఉంటాయి. ఇక ఈ లెక్కన చూసుకుంటే.. నెలకు 1.5 కోట్లకు పైగా ఈమె ఆదాయం పొందుతుందని సమాచారం. సినిమా రెమ్యూనరేషన్ ఎంతంటే? ఇక సోషల్ మీడియా ద్వారానే కాదు సినిమాల పరంగా కూడా ఈమె భారీ పారితోషకం తీసుకుంటుంది. బాలీవుడ్ లో ఈమె నటిస్తున్న ఒక్కో చిత్రానికి బడ్జెట్ , నిర్మాణ సంస్థను బట్టి సుమారుగా రూ.6 కోట్ల వరకు రెమ్యూనరేషన్ తీసుకుంటున్నట్లు సమాచారం. ఇక దక్షిణాది విషయానికొస్తే.. ఎన్టీఆర్ సరసన నటించినందుకుగానూ .. దేవర సినిమాలోని తన పాత్రకు రూ.3కోట్లు తీసుకున్న ఈమె.. రామ్ చరణ్ హీరోగా నటించిన పెద్ది సినిమా కోసం రూ.4కోట్ల వరకు రెమ్యూనరేషన్ తీసుకున్నట్లు సమాచారం. మొత్తానికి అయితే ఇటు సినిమా రంగంలో అటు డిజిటల్ ప్రపంచాన్ని బిజినెస్ సూత్రంగా మార్చుకున్న జాన్వీ కపూర్ ఇండియన్ సినీ ఇండస్ట్రీలో అత్యంత ప్రభావంతమైన యువ నటీమణులలో ఒకరిగా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.

GODAVARI BHAVISHATH

# VAARTHA

GODAVARI SPECIAL BULLITIN

## TMC's Chandrima Bhattacharya Quits as Bengal Chief a Month After Appointment



Kolkata: In yet another setback for the Mamata Banerjee faction of the Trinamool Congress, the party's West Bengal state president Chandrima Bhattacharya stepped down from her position on Saturday, barely a month after she was entrusted with the crucial organisational responsibility in the aftermath of the party's assembly election debacle. In a letter addressed to the Trinamool Congress chairperson, Bhattacharya also relinquished responsibilities from all other posts she held in the party, triggering speculations on whether she had severed her ties with the Mamata Banerjee-led wing of the party for all practical purposes.

Bhattacharya was named state president at the party's national working committee meeting held at Mamata Banerjee's Kalighat residence on June 3, replacing senior leader Subrata Bakshi. She also withdrew herself as the authorised signatory of the accounts of the TMC and its associate organisations maintained in various banks and as Mamata Banerjee's authorised point person to handle the party's affairs before the Election Commission.

A former minister in the erstwhile Mamata Banerjee government – in charge of key departments like Finance and Health as Minister of State, and a prominent leader of the party who led its women's wing – Bhattacharya had remained one of the closest aides of the TMC supremo and her long-term associate. "At the end I would like to state that I have the highest regards for you and will remain ever respectful to you," she stated in her resignation letter.

Talking to reporters, Bhattacharya later clarified that her decision was triggered by Banerjee's over-the-phone admonishment, blaming her for "allowing the Ritabrata Banerjee-led rebel faction of the party to take control of the party's Trinamool Bhavan operational headquarters" in Kolkata. Bhattacharya was present at her office when the Ritabrata-led rebel faction had walked into the Trinamool Bhavan on Friday but had left the building shortly after. The rebel faction leaders held a meeting at the premises before changing the locks of the main gate and declaring they would henceforth operate from the premises.

"I was deeply hurt when she (Mamata Banerjee) called me to say that I have handed over the party office to them (the rebels), although I do not know how I did that. It is evident that my loyalty and trustworthiness were shaken from their roots. This had never happened in the past. Once those fundamental binding forces are gone, there is no reason for me to stay in the party or return to it," Bhattacharya told reporters. Asked whether she would join the rebel camp, Bhattacharya said, "There's more to life than this. I am yet to decide the course I will chart". Bhattacharya, however, refused to comment on the deepening factional fights within the party and which side she supported on grounds that "the matters are sub judice either before the Election Commission or before the court". Minutes later, Bhattacharya was seen sitting in a meeting with the rebel camp leaders at the chamber of Ritabrata Banerjee, the Leader of Opposition, in the state legislative assembly. Bhattacharya was welcomed at the assembly gate by the deputy leader of opposition and a prominent member of the rebel camp, Sandipan Saha. Bhattacharya's move came within weeks of her son, Sourav Basu – a former Kolkata Municipal Corporation councillor of the TMC – joined the rebel camp and attended its meetings. Basu was also seen present at the state assembly huddle. "I will not not comment in detail about the development that has only just taken place. However, I will say this: Her (Bhattacharya's) self-esteem was never hurt when Mamata Banerjee entrusted her with responsibilities of key departments in the government. It has only surfaced after the party lost the polls," Kunal Ghosh, TMC MLA and Mamata-loyalist, said, taking a jibe at the dissident leader. Bhattacharya, a three-time MLA of the state, was humbled by BJP's Sourav Sikdar at the Dum Dum Uttar constituency in the 2026 assembly elections. Her relinquishment of party positions comes amid the Trinamool Congress's steady erosion of its top leadership since its shock defeat in the 2026 assembly elections. Among the most prominent exits was former Kolkata Mayor and senior minister Firhad Hakim, who joined the Ritabrata Banerjee-led rebel camp. Veteran MLA Jawed Khan and senior leader Golam Rabbani also aligned with the dissident faction, while as many as 20 of the party's 28 Lok Sabha MPs joined a breakaway group seeking recognition as a separate parliamentary bloc after merging with the Nationalist Citizens Party of India and extending support to the NDA. The rebellion has deepened into an organisational crisis, with the dissident camp staking claim to the party's headquarters, symbol and funds, prompting the Election Commission to begin proceedings on the dispute.

# PM Modi Inaugurates Landmark Pachpadra Greenfield Refinery



Prime Minister Narendra Modi, Rajasthan Governor Haribhau Bagde, Union Minister for Petroleum and Natural Gas, Chief Minister Bhajanlal Sharma and others during the inauguration of the Pachpadra refinery site, in Balotra.

## PM Modi Inaugurates New Jodhpur Airport Terminal



Jodhpur: Prime Minister Narendra Modi on Saturday inaugurated the new terminal building at Jodhpur airport and launched the modified UDAN Scheme.Modi arrived in Jodhpur and was received at the airport by Governor Haribhau Bagade, Union Minister and Jodhpur MP Gajendra Singh Shekhawat, and Chief Minister Bhajanlal Sharma. ExecutiveBranch The prime minister unveiled the inauguration plaque by pressing a remote button and toured the new terminal building.

He also launched the Modified UDAN Scheme. With an allocation of Rs 28,840 crore over the next 10 years, the scheme aims to accelerate the next phase of aviation-led development. The revamped scheme focuses on multiple strategic components to ensure comprehensive and sustainable air connectivity. The new terminal building at Jodhpur airport has been developed at a total cost of Rs 480 crore. Spread over more than 23,000 square metres, it is designed to handle up to 20 lakh passengers annually.

The terminal is equipped with modern passenger amenities to provide a seamless and comfortable travel experience. Architecturally inspired by Rajasthan's royal heritage, the terminal blends traditional elements such as arches and jharokhas with contemporary design. Folk artistes presented cultural performances during the prime minister's visit to the new terminal.

## France, UK Step Up Strait of Hormuz Security Efforts West Asia

Paris: French President Emmanuel Macron said that France has deployed mine countermeasures assets to West Asia to help restore safe navigation through the Strait of Hormuz, while the United Kingdom and France announced they would work with Oman to ensure safe passage through the strategic waterway and stand ready to deploy a wider multinational mission if required. In a post on X, Macron said, "France has deployed mine countermeasures assets to the Middle East, including two minehunters in particular. Accompanied by two frigates and a maritime patrol aircraft, these assets are ready to contribute, alongside our partners, to the full resumption of navigation and to ensure the safety of traffic in the Strait of Hormuz." "The signing, on June 17 last, of the memorandum of understanding between the United States and Iran constitutes an important step forward for regional stability, particularly by reaffirming freedom of navigation in the Strait of Hormuz," he added. Macron said France was adapting its military deployment following discussions with the Sultan of Oman, Haitham bin Tariq Al Said. "In light of this favourable development and the changing needs, following the constructive exchanges I had with the Sultan of Oman, I have decided to adapt our deployment," he said. He added, "The aircraft carrier Charles de Gaulle is thus returning to its home port in Toulon, while our mine countermeasures assets and their escort remain deployed and ready to intervene alongside our partners." "France remains fully engaged and will continue to adjust its assets based on the evolving situation and the region's security needs," Macron said. In a joint statement issued on Friday (local time), British Prime Minister Keir Starmer and Macron reaffirmed their commitment to securing navigation through the Strait of Hormuz.

The statement said, "The Strait of Hormuz is a vital artery for the global economy. Restoring safe transit for ships of all nations through the Strait is a matter of global concern." It added, "The Sultanate of Oman has agreed to work with the United Kingdom and France to ensure that its sovereign territorial waters are safe for navigation." "The UK and France also stand ready to deploy the wider Multinational Military Mission to support freedom of navigation in the Strait of Hormuz," it further said. "The United Kingdom and France reaffirm their shared commitment to regional stability, respect for the sovereignty of all States, and their willingness to maintain close cooperation with their partners in order to uphold global security, freedom of navigation and international law," the joint statement said.

వార్త
05-07-2026


# ఓటర్ల జాబితా సమగ్ర పునశ్చరణకు పౌరులంతా సహకరించాలి

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు



కాకినాడ, (జిఎస్ బి వార్త ) : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ఓటర్లందరితో కూడిన సమగ్ర జాబితా రూపకల్పనకు పౌరులందరూ స్వచ్ఛందంగా ప్రభుత్వానికి సహకరించి తమ వివరాలను అందజేయాలనిప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ "విద్యార్థుల నైతిక విలువల " సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం ఆయన తన గృహాన్ని సందర్శించిన బూత్ స్థాయి అధికారికి వివరాలు నింపిన తమ కుటుంబ సభ్యుల సర్ ఎన్ రోల్ మెంట్ ఫారాలను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 15వ తేదీన ప్రారంభమైన ఈ ఓటర్ల జాబితాల సమగ్ర పునశ్చరణ మరియు నూతన నమోదు ప్రక్రియ ఈ నెల 14వ తారీకు వరకు కొనసాగుతుందని పౌరులందరూ తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలన్నింటినీ ఎలాంటి దాపరికం లేకుండా స్పష్టంగా అందజేయాలని కోరారు. దీనివల్ల అర్హులైన ఓటర్లను గుర్తించి, పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం అధికారులకు తేలికవుతుందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా పక్కాగా ఉన్నప్పుడే, రేపటి రోజున ఒక మంచి ప్రభుత్వాన్ని, సరైన ప్రజాప్రతినిధులను ఎంచుకునే అవకాశం ప్రజలకు లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఒక ప్రధానమైన కర్తవ్యంగా భావించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని చాగంటి కోటేశ్వరరావు కోరారు. అధికారులు అందజేసిన ఎన్రోల్మెంట్ పత్రాలను సత్వరం పూర్తి చేసి తిరిగి ఇవ్వాలని, 'రేపు, ఎల్లుండి' అని నిర్లక్ష్యం చేస్తూ అధికారులను చుట్టూ తిప్పించకుండా వెంటనే ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. పౌరులు త్వరితగతిన స్పందించి సహకరిస్తేనే, ఎన్నికల సంఘం మరియు అధికారులు ఈ కార్యక్రమాన్ని అనుకున్న సమయానికి విజయవంతంగా పూర్తి చేయగలుగుతారని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగానే తాను కూడా శనివారం తన కుటుంబ వివరాలన్నింటినీ పత్రంలో నమోదు చేసి అధికారులకు అందజేసినట్లు తెలియజేశారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఈ ప్రక్రియలో పౌరులందరూ తమ వంతు బాధ్యతగా ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# తొలి తిరుపతి శనివారం ఆధాయం రూ. 1.90 లక్షలు



పెద్దాపురం, జూలై 4, జి ఎస్ బి వార్త : పెద్దాపురం మండలం తొలి తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ శృంగారవల్లభ స్వామి దేవస్థానంలో శనివారం సుమారు 12వేలు మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. శనివారం కావడంతో స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరణ చేసి విశేష పూజలు ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డాది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు నిర్వహించారు. కాగా శనివారం ఆలయానికి వచ్చిన ఆధాయం రూ. 1,90,526 గా ఆలయ అధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,26,880, అన్నదాన విరాళాల ద్వారా రూ. 37,091, కేశ ఖండన ద్వారా రూ. 4,480, తులాభారం ద్వారా రూ. 440, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 21,675 లు వెరశి రూ. 1,90,526 లు ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానం తరుపున భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదం ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే సుమారు 3 వేల మంది భక్తులు మధ్యాహ్నం అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులు క్యూ కట్టి స్వామివారి దర్శనం కోసం ఎదురు చూసారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమా చార్యులు, పెద్దింటి నారాయణా చార్యులు, ధర్మకర్తల మండలి చైర్మన్ మెయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు.

# అడ్డతీగల మండలం లో అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

అడ్డతీగల,జిఎస్ బి వార్త,జూలై4: స్థానిక అడ్డతీగల మండల కేంద్రంలో గల పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో వున్న విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సిఐ గజేంద్ర కుమార్,ఎస్సై వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. యువత అల్లూరి ఆసియాలను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నడింపల్లి రవివర్మ ఆధ్వర్యంలో డాక్టర్ రవి వర్మ చేతుల మీదుగా పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు,కొరపల్లి బాబు,నడింపల్లి రవివర్మ,నడింపల్లి తాతబాబు,పిడి ప్రకాష్,దమ్ము సత్యనారాయణ, రాష్ట్ర అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి దంగేటి సత్తిబాబు,తణుకు వెంకటరామయ్య, ప్రముఖ వైద్యులు డాక్టర్ రవి వర్మ పాల్గొని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారామరాజు కాలనీలో అల్లూరి విగ్రహానికి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడ్డతీగల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో విప్లవ వీరుడు,మన్యం ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ పి.మహేష్ రెడ్డి మాట్లాడుతూ,దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన పోరాట పటిమను,ఆయన త్యాగాలను స్మరించుకున్నారు.యువత ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు.డాక్టర్ అనూష, పి.సునీత,రాఘవ, హాస్పిటల్ కౌన్సిలర్ నారే,ఆసుపత్రి సిబ్బంది పాల్గొని అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించారు. అడ్డతీగల మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఎంపీడీవో ఏ.వి.వి.కుమార్ ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు వారిని స్మరించుకుంటూ వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అడ్డతీగల మండలం పైడిపుట్ట గ్రామంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు రచ్చబండ నిర్వహించిన చారిత్రక ప్రదేశంలో శనివారం అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు గౌతమ్ రాజు పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.



# కోనసీమ క్వాయర్ కాంక్లేవ్ వర్క్ షాప్ విజయం కోసం అధికారులు సమన్వయం తో పనిచేయాలి:

## జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్



అమలాపురం, జూలై 4:(జిఎస్ బి వార్త): ఈనెల 16, 17 తేదీలలో నిర్వహించనున్న 'కోనసీమ క్వాయర్ కాంక్లేవ్ వర్క్‌షాప్ ను అధికారులు సమన్వ యంతో విజయవంతం చేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ పిలుపు నిచ్చారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన ఈ వర్క్‌షాప్ సన్నద్ధత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోనసీమ క్వాయర్ కాంక్లేవ్ ప్రచార పత్రికను కలెక్టర్ ఆవిష్కరించా రు.?సమా వేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో శక్తివంతమైన కొబ్బరి పీచు పరిశ్రమ ఏర్పాటుకు పునాది వేసే దిశగా ఈ కార్యక్రమం సాగాలన్నారు. వర్క్‌షాప్‌కు వచ్చే ప్రతి నిధులకు రిజిస్ట్రేషన్ సమ యంలోనే ఆహ్వాన పత్రాలు, బ్రోచర్లు, నోట్ ప్యాడ్, ఐడీ కార్డ్, పెన్ను, పెన్సిల్‌తో కూడిన కిట్‌ను అందించాలని ఆదేశించా రు. ఆసక్తి గల వారు సులభంగా రిజిస్ట్రేషన్ చేసు కునేందుకు క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని అందు బాటులో ఉంచాలన్నారు. ఈ వర్క్‌షాప్ కు ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల కాయర్ పరిశ్రమల డైరెక్టర్లు, ఎంఎ స్ఎంఈ మంత్రి వర్యులతో పాటు సుమారు 10 మంది ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉందని తెలి పారు. వేదిక, స్టాల్స్ నిర్వహణ, ఆహార ఏర్పాట్లు, మినిట్ టూ మినిట్ ప్రోగ్రామ్ కార్యాచరణ, కరప త్రాల ప్రచురణ, సామాజిక మాధ్యమాలలో విస్తృత ప్రచారం వంటి బాధ్యత లను అధికారులకు కేటా యించారు.?వ్యర్థాల నుంచి సంపద సృష్టి – ఉపాధి కల్పన కొరకు ?కొబ్బరి ప్రాసెసింగ్ ద్వారా లభించే ప్రాథమిక ఉప–ఉత్పత్తి అయిన పీచు కొబ్బరి పీచు పరిశ్రమకు కీలకమైన ముడి పదార్థమని కలెక్టర్ పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం అందుబాటులో ఉన్న పీచులో కేవలం 20% మాత్రమే వినియోగించ డుతోందని, మిగిలిన వ్యర్థా లను సంపదగా మార్చడా నికి ఈ వర్క్‌షాప్ ఒక అద్భుతమైన అవకాశమని చెప్పారు. దీని ద్వారా గ్రా మీణ పారిశ్రామికీకరణతో పాటు ముఖ్యంగా మహిళలు, యువ తకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుం దని ఆశాభావం వ్యక్తం చేశారు.?ఒక జిల్లా – ఒక ఉత్పత్తి ఒక జిల్లా ఒక ఉత్పత్తి పథకం కింద ఈ జిల్లా కొబ్బరి, కొబ్బరి పీచు ఉత్పత్తుల కోసం గుర్తింపు పొందిందని కలెక్టర్ గుర్తు చేశారు. కొబ్బరి పీచు రంగం యొక్క పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయ దానికి జిల్లా యంత్రాంగం, క్వాయర్ బోర్డు మరియు ఇతర భాగస్వామ్య పక్షాల తో కలిసి చురుగ్గా కృషి చేస్తోందన్నారు. విలువ జోడింపును పెంచడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నాన్ని స్వీక రించడం, మార్కెట్ అను సంధా నా లను బలోపేతం చేయ డమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు.?మౌలిక సదుపాయాలు సాంకేతిక శిక్షణ ఆధునిక శుద్ధి కేంద్రాలు, లక్షిత వర్గాలకు నైపుణ్యా భివృద్ధి, విధాన పరమైన మద్దతు, ఉమ్మడి సౌకర్య కేంద్రాలతో కూడిన 'ప్రత్యేక కొబ్బరి పీచు పార్క్ మరియు క్లస్టర్ అభివృద్ధికి ఈ వర్క్‌షాప్ దోహదపడు తుందని కలెక్టర్ వివరించా రు. ఆధునిక కొబ్బరి పీచు శుద్ధి సాంకేతి కతలతో పాటు క్వాయర్ జియో టెక్స్‌టైల్స్, చాపలు, తాళ్లు, కొబ్బరి పీచు మిశ్రమాలు, ఇతర పర్యావరణ అను కూల వస్తువుల వినియో గాన్ని ఈ వర్క్‌షాప్ ప్రోత్స హిస్తుందన్నారు.?సాంకేతిక శిక్షణ, నాణ్యతా ప్రమాణా లు, వ్యాపార నిర్వహణ, డిజిటల్ మార్కెటింగ్ ద్వారా స్థానిక పారిశ్రా మికవేత్తలు, స్వయం సహాయక బృందాలు రైతు ఉత్పత్తిదారుల సంఘాల సామర్థ్యాన్ని పెంపొందిం చనున్నారన్నారు.?ప్రభుత్వ పథకాల ప్రాప్యత కొరకు ప్రభుత్వ పథకాలు, సబ్సి డీలు మరియు పోర్టల్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫా రమ్‌లను సులభంగా పొం దేలా అవగాహన కల్పిస్తా రన్నారు అంతర్జాతీయ నాణ్య తా ప్రమాణాలు, ధృవీకరణలు సాధించి, అంతర్జాతీయ మార్కెట్ పరిధిని విస్తరించే దుకు ప్రత్యేక సెషన్లు ఉంటాయ న్నారు.ఈ బృహత్తర కార్యక్ర మంలో జిల్లా పరిపాలన, క్వాయర్ బోర్డు, ఎంఎస్ఎంఈ అధికారులు, జాతీయ కొబ్బరి పీచు సమాఖ్యలు చురుగ్గా భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ కోరారు. ఈ సన్నద్ధత సమా వేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వైభోం నైదియా దేవి, జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు, జిల్లా ఉద్యాన అధికారి బి.వి. రమణ, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ, ఏపీఐఐసీ డీజెడ్ఎం రాధామణి, ఎల్‌డీఎం కేశవ వర్మ, నాబార్డ్ డీడీఎం స్వామి నాయుడు, సిడ్బి ప్రోగ్రా మేనేజర్ శ్రీనివా సరావు, క్వాయర్ బోర్డ్ ప్రాంతీయ అధికారి సుబు లాల్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి





కాకినాడ జూలై 4: (జిఎస్ బి వార్త) : ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జూలై 31వ తేదీన చలో కలెక్టరేట్ ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ నరసింహ నాయక్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాయుడు నాగలక్ష్మి చంద్రమల్ల పద్మా మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఏడు సంవత్సరాల క్రితంనుండి 10000 రూపాయలు జీతం ఇస్తున్నారు ఈరోజు ధరల చూస్తే అప్పటికి ఇప్పటికీ 1000 రెట్లు పెరిగిన అదే పదివేల రూపాయలు జీతంతో బ్రతకటం చాలా ఇబ్బందికరంగా బ్రతుకు భారమై ఆర్థికంగా మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని వాపోయారు కనీస వేతనాల చట్టం 2008లో సవరించారు అప్పటినుండి ఇప్పటివరకు ఆ చట్టాన్ని మూలన పడేసి కార్మికులను కట్టు బానిసల చేయడం దారుణమన్నారు ప్రజా ప్రతినిధులు ప్రజలకు సేవ చేస్తామని చెప్పి గద్దెనెక్కి ఒక్కొక్కళ్ళు లక్షల్లో జీతాలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు స్వచ్ఛంగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ సేవ చేస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించకపోవడం బాధాకరమన్నారు ఇదిలా ఉంటే ప్రజల ఆరోగ్య పరిరక్షణ చూస్తూ కీలకంగా అత్యవసర సర్వీసులు అందిస్తున్న ఆశా వర్కర్లకు జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్సీలలో ఆశా వర్కర్లతో అత్యవసర సేవలు నిలుపుదల చేసి బిఎల్ఓ డ్యూటీలు చేయాలని అధికారుల ఒత్తిడి చేయడం సరికాదన్నారు అధికారులు, జతీశీ లు, రాజకీయ నాయకులు బెదిరింపులు ఆపాలన్నారు ఆశా వర్కర్ చేయవలసిన రోజువారి పని తో పాటు బిఎల్ఓ డ్యూటీలు కూడా చేయాలని, ఎమ్మార్వోలు రెవెన్యూ సిబ్బంది ఒత్తిడి చేయడం తగదన్నారు ఆశా వర్కర్స్ మాతా శిశు మరణాలు తగ్గించడం కోసం పని మాత్రమే చేయగలరు.కానీ ఆశా వర్కు ర్ ,బి ఎల్ ఓ డ్యూటీలు రెండు ఒకే సమయంలో చేయటం అసాధ్యం. కావున ఏదైనా ఒక పని మాత్రమే ఆశా వర్కర్స్ చేసేలాగా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు మార్చి 5 న ప్రభుత్వంతో యూనియన్ రాష్ట్ర ప్రతినిధులు తో జరిపిన 11 డిమాండ్స్ తో కూడిన ది మట్టి ఖర్చుల నిమిత్తం 15000 ఇవ్వాలని సెలవులకు సంబంధించిన ఒప్పంద జీవోలు తక్షణమే విడుదల చేయాలని, జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు రిటైర్మెంట్ అయిన ఆశా వర్కర్లకు మరియు మరణించిన ఆశ వర్కర్ల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన గ్రాడ్యుటీని జిల్లా అధికారులు తక్షణమే ఇవ్వాలని కోరుతూ జూలై మొదటి మంగళవారం జరిగే ఆశా డే లో భోజన సమయంలో నిరసన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పీహెచ్సీలలో జరుగుతుందని ఆశా వర్కర్లకు పిలుపునిచ్చారు అంతేకాకుండా కనీస వేతనం అమలు చేసేంతవరకు ఆశా వర్కర్లందరూ నిరసన కార్యక్రమాలు చేస్తామని అందులో భాగంగా ఈ నెల 31వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని ఆశా వర్కర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు

# ఓ.ఎన్.జి.సి. ఆధ్వర్యంలో జూలై 1 నుండి 15 వరకు "స్వచ్ఛత పక్వాడ"




కాకినాడ, జూన్:(జిఎస్ బి వార్త) : ఓ.ఎన్.జి.సి. ఈస్టర్న్ ఆఫ్ షోర్ ఎసెట్ ఆధ్వర్యంలో జూలై 1వ తేదీ నుండి జూలై 15వ తేదీ వరకు "స్వచ్ఛత పక్వాడ" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓ.ఎన్.జి.సి. ఈ.ఓ.ఎ. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రబల్ సేన్ గుప్తా తెలిపారు. కాకినాడ రమణయ్యపేటలో శనివారం ఓ.ఎన్.జి.సి. హెచ్.టి.పి. కార్యాలయం వద్ద స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఈ.ఓ.ఎ. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రబల్ సేన్ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఓ.ఎన్.జి.సి. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమ వ్యాన్ జాతాను కూడా ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇ.డి. ప్రబల్ సేన్ గుప్తా మాట్లాడుతూ, ఈ నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓ.ఎన్.జి.సి. అధికారులు, జె.ఎన్.టి.యు.కె. పెట్రోకెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు వాక్‌థాన్‌లో పాల్గొన్నారు. రమణయ్యపేట ఓ.ఎన్.జి.సి. హెచ్.టి.పి. కార్యాలయం నుండి ప్రారంభమైన వాక్‌థాన్ సర్పవరం జంక్షన్, బోట్ క్లబ్ మీదుగా తిరిగి హెచ్.టి.పి. కార్యాలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో జె.ఎన్.టి.యు.కె. యూనివర్శిటీ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ॥ పద్మరాజు, ఓ.ఎన్.జి.సి. అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మూలపేట ఉపాధ్యాయ బృందానికి సత్కారం



యు కొత్తపల్లి జూలై 4(జి ఎస్ బి వార్త ) : మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి రావడం శుభ పరిణామమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారని కొత్తపల్లి మండల జనసేన నాయకులు రావు అక్షయ్ పేర్కొన్నారు. శనివారం రావు అక్షయ్ మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుని అక్కడి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.త్వరలోనే స్వయంగా మూలపేట పాఠశాలను సందర్శిస్తానని కూడా తెలిపారు. అలాగే కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పాఠశాల ల్యాబ్‌ల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.పవన్ కళ్యాణ్ ప్రతినిదిగా యు కొత్తపల్లి మండల జనసేన పార్టీ ఇంచార్జ్ రావు అక్షయ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందాన్ని శాలువాలతో సన్మానించి అభినందించారు అదేవిధంగా మూలపేట పాఠశాల మరింత అభివృద్ధి చెందేందుకు జనసేన పార్టీ యు కొత్తపల్లి మండల శాఖ తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలియజేశారు

# కొత్తపల్లిలో వంగవీటి మోహన రంగా జయంతి



యు కొత్తపల్లి జూలై 4(జి ఎస్ బి వార్త ) : కొత్తపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో దివంగత వంగవీటి మోహన్ రంగా జయంతి ఘనంగా నిర్వహించారు. తొలిత మోహన్రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రంగా అభిమానులు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా ఒక కాపు సామాజిక వర్గానికే కాకుండా బడుగు బలహీన వర్గాలకు సాయపడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు మోహనరంగా లాంటి మహోన్నత వ్యక్తి ప్రస్తుత సమాజంలో ఉండాలని కొని యాడారు. ఈ కార్యక్రమంలో సానా నాగు,గంధం గంగ బాబు, కొన మర్తి రాము, పెనుబోతుల వీరబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా అల్లూరి జయంతి

పెదపూడి(జి ఎస్ బి వార్త) : అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం గొల్లలమామిడాడలో మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు మురమళ్ళ వెంకటరమణ మాట్లాడుతూ దేశం కోసం జీవించడం గొప్పది దేశం కోసం ప్రాణ త్యాగం చేయడం మరింత గొప్పది అల్లూరి సీతారామరాజు జీవితం భారత స్వతంత్ర్య సమరంలో ధైర్యం త్యాగం దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం అయిన ఆదర్శాలు నేటికీ యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓ బి సి మోర్చా వైస్ ప్రెసిడెంట్ కడిమి వీర వెంకట మురళీకృష్ణ, మండల ఓబిసి మోర్చా అధ్యక్షులు కేత హరిబాబు, మండల ఓ బి సి మోర్చా ప్రధాన కార్యదర్శి వట్టూరి కృష్ణ సుధాకర్, భీమన్న చత్రపతి శివాజీ, చింతా ఆదిలక్ష్మి, బిజెపి కార్యకర్తలు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



RNI AP BIL14872/2024
గోదావరి భవిష్యత్ వార్త
గోదావరి స్పెషల్ బులిటెన్
తెలుగు దినపత్రిక



## జోన్-2, విజయవాడ, జాయింట్ డైరక్టర్ గా పదోన్నతి పొందిన కాకినాడ డిప్యూటీ డైరక్టర్ పి.తిమ్మప్ప



కాకినాడ, (జిఎస్ బి వార్త ) సమాచార పౌర సంబంధ శాఖ జోన్-2, విజయవాడ, జాయింట్ డైరక్టర్ గా పదోన్నతి పొందిన కాకినాడ డిప్యూటీ డైరక్టర్ పి.తిమ్మప్ప శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ను ఆయన ఛాంబరులో మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లాలో గత మూడు నెలలుగా కాకినాడ జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రుల పర్యటనలు తదితర అంశాలను వివిధ మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లడంలోను డిప్యూటీ డైరక్టర్ తిమ్మప్ప అందించిన సేవలను జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. జాయింట్ డైరక్టరుగా పదోన్నతి పొందినందుకు అభినందిస్తూ, జోనల్ అధికారిగా కాకినాడ జిల్లాకు మరిన్ని సేవలు అందించాలని కలెక్టర్ ఆయనను కోరారు. అనంతరం డిప్యూటీ డైరక్టర్ తిమ్మప్ప .... జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పే నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసి తాను జిల్లాలో పనిచేసిన కాలంలో అందించిన సహయ సహకారాలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## డివిజనల్ పిఆర్ఓ పి.రవికి డిపిఆర్ఓగా పదోన్నతి



కాకినాడ, (జిఎస్ బి వార్త ) : జిల్లా సమాచార పౌర సంబంధ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న డివిజనల్ పిఆర్ఓ పి. రవి ని డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గా పదోన్నతి కల్పిస్తూ సమాచార శాఖ డైరక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డిఐపిఆర్ఓ,డా.బిఆర్.అంబేత్కర్ కోనసీమ జిల్లాలో నియమితులై , ప్రస్తుతం కాకినాడ కార్యాలయంలో ప్రత్యేక విధులపై పనిచేస్తున్న ఆయనను డిఐపిఆర్ఓ, తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి వారి కార్యాలయంలో జిల్లా పౌర సంబంధ అధికారిగా పదోన్నతిపై నియమించారు. ఈ సందర్భంగా పదోన్నతి ఉత్తర్వులను పి.రవి కి సమాచార శాఖ జోన్-2 జాయింట్ డైరక్టర్ పి.తిమ్మప్ప అందజేసి శుభకాంక్షలు తెలిపారు. అలాగే కాకినాడ కార్యాలయ అధికారులు సిబ్బంది, పాత్రికేయులు ఆయనకు అభినందలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి సకాలంలో సహాయం చేసిన వారికి “గుడ్ సమరిటన్” క్రింద 25 వేలు నగదు బహుమతి



కాకినాడ, (జిఎస్ బి వార్త ) కాకినాడ, మెయిన్ రోడ్ నందు ట్రాఫిక్ అవేర్నెస్ లో భాగంగా “రోడ్డు ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స/ ప్రాణ రక్షణ సహాయక చర్యలు సకాలంలో చేసిన వారికి గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా 25వేల రూపాయల బహుమతి ఇవ్వబడునని ట్రాఫిక్ పోలీస్లు అవగాహనా కల్పించారు. 1,50,000 వరకు, రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత ఉచిత చికిత్స చేయబడునని . ప్రమాదం జరిగిన తేదీ నుండి ఏడు రోజుల వరకు ఉచిత చికిత్స రోడ్డు ప్రమాద బాధితులకు వర్తిస్తుందని. ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ వల్ల జరుగు రోడ్డు ప్రమాదాల గురించి, ట్రాఫిక్ రూల్స్ పైన మరియు హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. వాహనదారులు వేగం కన్నా ప్రాణం మిన్న అనే ఉద్దేశంతో వాహనం నడుపుకోవాలని, అతివేగం గా వాహనం నడపడం వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వలన జరుగు ప్రమాదములు గురించి, జీబ్రా లైన్స్ లేని ప్రదేశములలో రోడ్డు ను ఏవిధంగా దాటాలి, ట్రాఫిక్ ాఅస్త్రఅం వలన ఉపయోగములు, ఆటో లలో పరిమితికి మించి ప్రయాణించరాదని, ఈవ్ టీసింగ్ మరియు మహిళల భద్రతల గురించి కూడా అవగాహన కల్పించినారు. ఈ కార్యక్రమం నందు ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ గారైన ఎన్ . రమేష్ మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ ఎన్యూమరేషన్ పత్రాల తిరిగి స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..



కాకినాడ, (జిఎస్ బి వార్త ) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -సర్ కు సంబంధించి కాకినాడ పట్టణ నియోజకవర్గం నోడల్ అధికారిగా నియమితులైన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. కాకినాడ పట్టణ నియోజకవర్గం ఈఆర్వో కేటి సుధాకర్ శనివారం కాకినాడ పట్టణం నియోజకవర్గం పరిధిలో బిఎల్వోలు ఎన్యూమరేషన్ పత్రాల తిరిగి స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. డైరీ ఫారం సెంటర్ 95వ పోలింగ్ కేంద్రం, భానుగుడి19వ పోలింగ్ కేంద్రం, రామారావు పేట 64వ పోలింగ్ కేంద్రం, సాంబమూర్తి నగర్ 45వ పోలింగ్ కేంద్రాను జేసీ.. ఏఈఆర్వోలతో తనిఖీ చేశారు. గృహ సముదాల్లోకి వెళ్లి స్వయంగా ఓటర్లతో మాట్లాడి ఎన్యూమరేషన్ పత్రాలు డిజిటలైజేషన్ ప్రక్రియను పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సూపర్వైజర్లు, బీఎల్వోలు తో మాట్లాడి ఎన్యూమరేషన్ పత్రాలు ఓటర్ల దగ్గర నుంచి తిరిగి స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియ మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశనం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచన మేరకు జిల్లాలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -సర్ ప్రక్రియను అత్యంత సమగ్రంగా, పటిష్టంగా నిర్వహించాలని జేసీ అధికారులను ఆదేశించారు. ఈ నెల 14 తో సర్ ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో లక్ష్యంలోపు కాకినాడ పట్టణ నియోజకవర్గంలో డిజిటలేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని జేసీ సిబ్బందిని ఆదేశించారు. తక్కువ శాతం ప్రగతి కనబరిచిన పోలింగ్ కేంద్రాల పరిధిలోని బిఎల్ఏలు, సూపర్వైజర్లు, ఇతర సిబ్బంది మరింత ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ పరిశీలనలో జేసీ వెంట కాకినాడ పట్టణ ఏఈఆర్వో, తహశీల్దార్ వి.జితేంద్ర, సూపర్వైజర్లు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం పూర్తిగా అభివృద్ధి చెందాలంటే గొడ్డలి పార్టీ వాసన కూడా కనబడకూడదు

### రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత



అనపర్తి జూన్ 4( జి ఎస్ బి వార్త ) రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గొడ్డలి పార్టీగా అభివర్ణించారు. రాష్ట్రం పూర్తిగా అభివృద్ధి చెందాలంటే గొడ్డలి పార్టీ వాసన కూడా కనబడకూడదన్నారు. అనపర్తి నియోజకవర్గం లో చిన పొలమూరు, పొలమూరు, మహేంద్రవాడ గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన హోం మంత్రి మహేంద్రవాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. అనపర్తి నియోజకవర్గంతో తనకు అవినాభావ సంబంధం ఉందని మంత్రి వెల్లడించారు.. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అంటే సీఎం చంద్రబాబు నాయుడు అత్యంత ఇష్టపడతారని పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన నాయకుడు రామకృష్ణారెడ్డి అని అనిత కొనియాడారు. పోలీస్ శాఖ సక్రమంగా పని చేస్తుందని అందువలన క్రైమ్ రేటు 14% తగ్గిందని హోం మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం కూటమి నాయకులు, మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి...




కోరుకొండ జులై 4 (జి ఎస్ బి వార్త) సంస్మరణ పక్షోత్సవాల సందర్భంగా రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో శనివారం భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో విద్యార్థునుల ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ పిలుపుమేరకు రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఆదేశాలతో రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషీధ రాజు సూచనలతో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీవిద్య గారి సారథ్యంలో, సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహిళా సాధికారత కమిటీ చైర్ పర్సన్ మన గౌరవ పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి హాజరై ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్రను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఈ తరం విద్యార్థినీ విద్యార్థులకు ఎంతైనా ఉన్నది అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఈ కార్యక్రమశీకు విశిష్ట అతిథి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఈ కార్యక్రమం స్టేట్ కన్వీనర్ అయిన బిట్రా శివన్నారాయణ , మరొక విశిష్టా అతిథి రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీమతి రోహిణి , ఏపీ ఆర్ చౌదరి , బొమ్మల దత్తు, పరిమి రాధాకృష్ణ , రేలంగి శ్రీదేవి తాడిమల్ల విజయవణి, పిడికిటి శ్రీదేవి, ,క్షత్రియ బాల సుబ్రహ్మణ్య సిశీగ,సుమారు 1000 మంది కళాశాల విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

## రైతు కుటుంబాల సంక్షేమానికి అండగా నిలవాలి

### వైద్య శిభిరంలో ఎమ్మెల్యే, జిల్లా సహకార అధికారులు



సామర్లకోట, జూలై 4, జి ఎస్ బి వార్త : రైతులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు జి.మేడపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) చేపట్టిన ఉచిత వైద్య శిబిరం అభినందనీయమని, సహకార సంఘాలు రైతు కుటుంబాలకు అండగా ఉండాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప , జిల్లా సహకార అధికారి బి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం, సహకార వారోత్సవాల సందర్భంగా శనివారం జి మేడపాడు గ్రామంలోని సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. తాను గత 40 ఏళ్లుగా సహకార రంగంతో అనుబంధం కలిగి ఉన్నప్పటికీ, రైతులు వారి కుటుంబాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ స్థాయిలో వైద్య శిబిరాన్ని నిర్వహించడం అరుదుగా చూశానన్నారు. రైతుల సంక్షేమంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు కూడా సంఘం ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ జిల్లా సహకార అధికారి (డీసీవో) బి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, జి.మేడపాడు సొసైటీలో రైతులకు రుణాలు, ఎరువులు అందించడంతో పాటు వారి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలులోనూ ముందంజలో ఉందన్నారు. రైతు కుటుంబాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వైద్య శిబిరం నిర్వహించడం సంఘం సేవా దృక్పథానికి నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కాకినాడ ఏరియాలోని లోటస్ ఆసుపత్రి వైద్య బృందం, వెటర్నరీ వైద్య సిబ్బంది, వేట్లపాలెం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ పార్థేష్ , కాకినాడ లక్ష్మీ హాస్పిటల్స్ రైజిల్ డాక్టర్ నారాయణ మూర్తి డాక్టర్ వంశీ, వేట్లపాలెం పిహెచ్సి ఎమ్ ఎల్ హెచ్ సీ హెచ్ పి స్టీఫెన్, సరోజిని ఏఎన్ఎం రామకుమారి, జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, సుమారు 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి గర్భిణీలు బాలింతలకు సైతం మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు కాకినాడ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యుల చౌదరి (శ్రీనుబాబు), జి.మేడపాడు సొసైటీ అధ్యక్షుడు పాలకుర్తి వీరభవనారాయణ, డైరెక్టర్ జనా వెంకట్రావు, అనపర్తి డిస్ట్రిక్ట్ కమిటీ వైస్ చైర్మన్ గోలి కృష్ణమూర్తి, జి మేడపాడు ఎత్తిపోతల పథకం ఉపాధ్యక్షులు పాలకుర్తి చినబాబు, సామర్లకోట సొసైటీ అధ్యక్షులు పైన్ని శ్రీనివాసరావు, జనసేన జిల్లా నాయకులు పంచమర్తి రాజన్న, సొసైటీ కార్యనిర్వహణాధికారి ఎం శ్వేత,సహకార శాఖ అధికారులు, వివిధ సహకార సంఘాల ప్రతినిధులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా

### 79వ జయంతి వేడుకల్లో పాల్గొన్న కంబాల శ్రీనివాసరావు



గోకవరం జులై 04: జి ఎస్ బి వార్త : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత నాయకుడు వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి వేడుకలు గోకవరంలో యూత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు గాజింగం నాని, దాసరి తమ్మన్న దొరలతో కలిసి వంగవీటి మోహన్ రంగా, ఎస్వీ రంగారావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కటింగ్ నిర్వహించి, ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, వంగవీటి మోహన్ రంగా బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజానాయకుడని కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితం కాకుండా, పేదల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్థానిక ప్రముఖులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## సర్ కు అందరూ సహకరించాలి

### ...ఎంఆర్ఓ: సీతాపతిరావు



పెదపూడి(జి ఎస్ బి వార్త) : పెదపూడి మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాలు నందు అనపర్తి నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఎం రాజా రమేష్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో నరేంద్ర రెడ్డి, మండల తాసిల్దార్ సీతాపతి రావు, మండలానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ వాటర్ జాబితా సవరణ కొరకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకుతో ఈఆర్వో సవివరంగా ప్రస్తుతం జరుగుతున్న సర్ ప్రోగ్రాం గురించి వివరంగా చెప్పి రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఈ లను సహకరించాలని కోరారు. ఓటర్ లిస్ట్ లో అనార్హులు ఎవరు ఉండకూడదని, అలాగే అర్హులు ఎవరు మిస్ అవ్వకుండా చూడాలని ఆయన రాజకీయపక్ష నాయకులను కోరారు. ప్రస్తుతం సర్ ప్రోగ్రాం లో పి ఎల్ వో లు, సూపర్వైజర్లు, ఏ ఈ ఆర్ ఓ లు చేస్తున్న పనులకు రాజకీయ పార్టీలకు చెందిన బి ఎల్ ఏ లు సహకరించాలని అందువల్ల సంపూర్ణమైన వాటర్ లిస్టులు తయారవుతాయని డ్రాఫ్ట్ పబ్లికేషన్ అయ్యాక ఏవైనా అభ్యంతరాలు ఉంటే అప్పుడు రెక్టిఫై చేసుకునే అవకాశం ఉందని వీఆర్వో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

## విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 130వ జయంతి వేడుకలు

రాజమహేంద్రవరం (జిఎస్ బి వార్త) : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 130వ జయంతి సందర్భంగా శనివారం రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సమరంలో ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా అసమాన పోరాటం చేసి తన ప్రాణాలను దేశం కోసం అర్పించిన మహోన్నత విప్లవ వీరుడని అధికారులు కొనియాడారు. ఆయన దేశభక్తి, ధైర్యసాహసాలు, త్యాగనిరతి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కో-ఆర్డినేటర్, సూపరింటెండెంట్ పి. సుబ్రహ్మణ్యం, జిల్లా మత్స్యశాఖ అధికారి టి. నిర్మలా కుమారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

Printed&published by on behalf (owner) Editor : GUNIPE SOBHAN BABU , Divya Publications, 4-160, DIWAN THOTA, PENUGUDURU, KAKINADA, ANDHRA PRADESH - 533016. printed at Rainbow printers ,6-84, SAIBABAPUNTHA ROAD, HUKUMPETA, RAJAHMUNDRY RURAL, EAST GODAVARI, ANDHRA PRADESH - 533107.RNI APBIL/26/A4072.email sobhangunipe@gmail.com.cell 9848899351.